సాక్షి
జయశంకర్ భూపాలపల్లి
శుక్రవారం | 3 | నవంబర్ | 2023



ఒకటికి రెండింతలు..

నకిలీ కరెన్సీని చలామణి చేస్తున్న ముఠాను గురువారం కాకతీయ యూనివర్సిటీ పోలీసులు అరెస్టు చేశారు.

-IVలో▸



తప్పిన పెనుప్రమాదం

స్టీరింగ్ లాక్ కావడంతో విద్యార్థులతో వెళ్తున్న ఓ ప్రైవేట్ స్కూల్ బస్సు సూర్యానాయక్‌తండా శివారులో కాల్వలోకి దూసుకెళ్లింది.

-IVలో▸

గరిష్టం/కనిష్టం
$32.1^0/23.2^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ ఉంటుంది. రాత్రివేళ చలిగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఓపెన్ కాస్ట్ మైన్ తనిఖీ



మల్హర్: 54వ వార్షిక రక్షణ పక్షోత్సవాలను పురస్కరించుకుని మండలంలోని తాడిచర్ల ఓపెన్ కాస్ట్ మైన్‌ను సింగరేణి కాలరీస్ ఎస్‌వీ రావు బృందం గురువారం తనిఖీ చేసింది. ఈ సందర్భంగా స్పెషల్ సేఫ్టీ కమిటీతో సమావేశం నిర్వహించారు. ప్రమాద స్థితిగతులు, రక్షణపై సభ్యులకు అవగాహన కల్పించారు. రక్షణపై ప్రదర్శించిన నాటిక పలువురిని ఆకట్టుకుంది. అనంతరం ఓపెన్‌కాస్ట్ ప్రదేశాల్లో మొక్కలు నాటారు.

హుండీ ఆదాయం రూ.17.36లక్షలు



కాళేశ్వరం: కాళేశ్వరంలోని శ్రీకాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయం, అనుబంధ దేవాలయాల్లో హుండీలను లెక్కించగా రూ. 17.36లక్షల ఆదాయం సమకూరినట్లు ఈఓ మహేష్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దేవాదాయశాఖ పరిశీలకులు అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో లెక్కించారు. నగదు రూ.17,36,636, 3కిలోల 500 గ్రాముల మిశ్రమ వెండి, 18గ్రాముల మిశ్రమ బంగారం వచ్చినట్లు ఈఓ తెలిపారు. కామారెడ్డికి చెందిన శ్రీరాజరాజేశ్వరి సేవాసమితి 139మంది సభ్యులు, శ్రీముక్తీశ్వర సేవాసమితి సభ్యులు 13మంది లెక్కింపులో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తలు అడప సమ్మయ్య, కామిడి రాంరెడ్డి, దేవేందర్, పద్మ, సర్పంచ్ వసంత, సూపరింటెండెంట్ శ్రీనివాస్, యూబీఐ అసిస్టెంట్ మేనేజర్ ప్రసాద్, ఏఎస్సై రాజేశం పాల్గొన్నారు.

క్షుద్రపూజల కలకలం



కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరం అటవీ ప్రాంతంలో క్షుద్ర పూజలు చేసిన ఆనవాళ్లు స్థానికుల్లో కలకలం సృష్టించాయి. గురువారం కాళేశ్వరం శివారు అటవీ ప్రాంతంలో ఓ చోట పసుపు, కుంకుమతో ముగ్గులు వేసి కోడిగుడ్లు, నిమ్మకాయలతో అలంకరించి ఓ జీవరాశి తలను నరికి క్షుద్రపూజలు చేసినట్లు సమాచారం. క్షుద్ర పూజలను చేతబడి కోసమా.. ఏదైనా గుప్త నిధుల కోసం ముందస్తుగా పూజలు చేశారో తెలియడం లేదు. ఈ విషయం స్థానికుల ద్వారా తెలియడంతో గ్రామంలో చర్చనీయాంశంగా మారింది. స్థానికులు చేశారా.. ఇతర ప్రాంతాల నుంచి వచ్చి క్షుద్ర పూజలు చేశారా అనే విషయం తెలియాల్సి ఉంది. నిత్యం భూపాలపల్లి, పరకాల, మంథనితో పాటు పలు పట్టణాల నుంచి క్షుద్రపూజలు చేసేందుకు ఇక్కడికి వస్తుంటారు. వారేమైనా పూజలు చేసి ఉంటారా అని స్థానికులు చర్చించుకుంటున్నారు.

అభివృద్ధిని చూసి ఓటేయండి



భూపాలపల్లి అర్బన్/రేగొండ: నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిని చూసి రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ఓటేయాలని భూపాలపల్లి ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి గండ్ర వెంకటరమణారెడ్డి ప్రజలకు సూచించారు. గురువారం భూపాలపల్లి మున్సిపాలిటీలోని 18, 19వ వార్డుల పరిధిలోని రెడ్డికాలనీ, ఎల్‌బీనగర్ కాలనీల్లో ప్రచారం నిర్వహించారు. రేగొండ మండలం రామన్నగూడెంతండా, జూబ్లీనగర్, నారాయణపూర్, తిరుమలగిరి, రేగొండ,రూపిరెడ్డిపల్లి, దమ్మన్నపేట గ్రామాలలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో రమణారెడ్డి మాట్లాడారు. ప్రతి ఇంటికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. ప్రజలు మారోసారి అవకాశం ఇవ్వాలని కోరారు. మూడోసారి బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకురావాలన్నారు. భూపాలపల్లిలో జరిగిన కార్యక్రమంలో నాయకులు జనార్దన్, రమేష్, కుమార్‌రెడ్డి, సమ్మయ్య, భాగ్యలక్ష్మి, హరీశ్‌రెడ్డి, రేగొండలో పీఏసీఎస్ చైర్మన్ విజ్జన్‌రావు, జిల్లా నాయకులు ఉమేష్ గౌడ్, పున్నం రవి, మండల అధ్యక్షుడు అంకం రాజేందర్, సర్పంచ్‌లు నారాయణరెడ్డి, కట్ల రాజిమధుసూదన్ రెడ్డి, శ్రీనివాసరావు, నరేష్, భిక్యానాయక్ ఎంపీటీసీలు పాల్గొన్నారు.

సార్వత్రిక సంగ్రామం!



ఉమ్మడి జిల్లాలో మొత్తం ఓటర్లు : **27,89,336**

పురుషులు **13,85,231**



స్త్రీలు **14,03,860**

ఇతరులు : **245**

పోలింగ్ కేంద్రాలు : **3,252**

ఎన్నికల షెడ్యూల్ ఇలా

- 3 నుంచి 10వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ
- 13వ తేదీన అభ్యర్థుల నామినేషన్ల పరిశీలన
- 15న ఉపసంహరణ గడువు, తుది జాబితా ప్రకటన
- 30న ఉదయం 7 నుంచి 5 గంటలకు పోలింగ్
- డిసెంబర్ 3వ తేదీన ఎన్నికల ఫలితాల ప్రకటన

నేడు ఎన్నికల నోటిఫికేషన్.. నామినేషన్లకు శ్రీకారం

- ఉమ్మడి వరంగల్ జిల్లాలో 12 స్థానాలకు ఎన్నికలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన ఎన్నికల సంఘం
- ఆర్‌ఓ కార్యాలయాలు సన్నద్ధం
- ఎన్నికల, పోలింగ్ పరిశీలకుల నియామకం
- 10 నుంచి రంగంలోకి ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు
- ముహూర్తాలు చూసుకుంటున్న అభ్యర్థులు.. 7, 9 తేదీలకే ఎక్కువ మంది మొగ్గు

సాక్షిప్రతినిధి, వరంగల్:

సార్వత్రిక ఎన్నికల సమరానికి సర్వం సిద్ధమైంది. భారత ఎన్నికల సంఘం నేడు నోటిఫికేషన్ విడుదల చేయనుంది. శుక్రవారం నుంచే నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో ఉమ్మడి వరంగల్‌లోని 12 నియోజకవర్గాల్లో రిటర్నింగ్ అధికారుల (ఆర్‌ఓ) కార్యాలయాలను ఇప్పటికే సిద్ధం చేశారు. ఆయా కార్యాలయాల్లో 3 నుంచి 10వ తేదీ వరకు ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల మధ్య నామినేషన్లు స్వీకరించనున్నారు. 5వ తేదీ ఆదివారం సెలవు కావడంతో ఆ రోజు మినహా.. మిగతా రోజుల్లో నామినేషన్లు స్వీకరిస్తారు. ఈనెల 7, 9 తేదీల్లో మంచి ముహూర్తాలు ఉండడంతో ఆ రెండు రోజుల్లో నామినేషన్లు ఎక్కువ సంఖ్యలో దాఖలయ్యే అవకాశం ఉంది. అలాగే అభ్యర్థుల పేర్లు, రాశుల ప్రకారం కొందరికి 8, 10 తేదీలు కూడా అనుకూలం కావడంతో ఆ రెండు రోజుల్లోనూ నామినేషన్లు ఎక్కువగా దాఖలు కావచ్చు. దీంతో ఒకే రోజు ఎక్కువ సంఖ్యలో నామినేషన్లు వస్తే వారికి స్లిప్‌లు ఇచ్చి అందరూ నామినేషన్లు వేసేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.



సర్వం సన్నద్ధం

సార్వత్రిక ఎన్నికల నగారా ఎప్పుడు మోగినా... సమర్థవంతంగా ఎన్నికలు నిర్వహించేందుకు అధికారయంత్రాంగం సర్వసన్నద్ధమైంది. ఉమ్మడి జిల్లాలో సుమారుగా 27.89 లక్షల పైచిలుకు ఓటర్ల కోసం 3,252 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇందులో 869 సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక గ్రామాలను గుర్తించారు. 12 నియోజకవర్గాల్లో ఇప్పటికే సున్నిత, అతి సున్నిత గ్రామాలు, పోలింగ్ కేంద్రాలను గుర్తించిన అధికారులు అక్కడ అన్ని ఏర్పాట్లు చేశారు. వీడియో రికార్డింగ్, వెబ్‌కాస్టింగ్, లైవ్ కాస్టింగ్‌ల ద్వారా ఎన్నికల సరళిని పర్యవేక్షించేందుకు ఎన్‌ఐటీ, ఇతర యూనివర్సిటీ విద్యార్థులను వినియోగించుకునేలా చర్యలు తీసుకున్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ఎన్నికలు జరుగుతున్న నియోజకవర్గాల్లో అక్రమ మద్యం, డబ్బు రావడానికి వీలు లేకుండా ఇప్పటికే డైనమిక్ చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి తనిఖీలు చేస్తున్నారు.

ఎన్నికల పరిశీలకులుగా ఐఏఎస్, ఐపీఎస్‌లు..

ఉమ్మడి వరంగల్‌లోని 12 అసెంబ్లీ నియోజకవర్గాలకు ఐఏఎస్, ఐపీఎస్, ఐఆర్ఎస్ అధికారులను సాధారణ, శాంతిభద్రతలు, వ్యయ పరిశీలకులుగా గురువారం నియమించారు. వీరంతా ఈనెల 10న ఎన్నికల విధుల్లో చేరనున్నారు. సాధారణ పరిశీలకులుగా ఇతర రాష్ట్రాలకు చెందిన ఐఏఎస్ అధికారులు, శాంతిభద్రతల పరిశీలకులుగా ఐపీఎస్ అధికారులు, వ్యయ పరిశీలకులుగా ఐఆర్ఎస్ అధికారులు రానున్నారు. ఓట్ల లెక్కింపు పూర్తయ్యే వరకు ఇక్కడే ఉంటారు. వీరు ఎప్పటికప్పుడు, అభ్యర్థి, రాజకీయ పార్టీల కార్యకలాపాలు, సమావేశాలు, సభలను పరిశీలిస్తారు. పరిస్థితులపై ఎన్నికల సంఘానికి నివేదిక ఇస్తుంటారు.

నామినేషన్ నుంచే లెక్కలు మొదలు..

అభ్యర్థుల ఎన్నికల వ్యయం వారి నామినేషన్ రోజు నుంచి పరిగణనలోకి తీసుకుంటారు. నామినేషన్ దాఖలు చేయడానికి జనరల్, బీసీ అభ్యర్థులకు రూ.10 వేలు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.5 వేలుగా ఎన్నికల సంఘం నిర్ణయించింది. నామినేషన్ పత్రాల సమర్పణకు జాతీయ, రాష్ట్రస్థాయిలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల అభ్యర్థిని అదే నియోజకవర్గంలోని ఎవరైనా ఒక ఓటరు ప్రతిపాదించాలి. అభ్యర్థి అదే రాష్ట్రంలోని ఏ నియోజకవర్గం నుంచైనా ఓటు హక్కు కలిగి ఉండాలి. రిజిస్టర్డ్ పార్టీ, స్వతంత్ర అభ్యర్థులను మాత్రం అదే నియోజకవర్గానికి చెందిన పది మంది ఓటర్లు బలపర్చాలి. ప్రతిపాదకులు నిరక్షరాస్యులైతే ఆర్‌ఓ ఎదుట నామినేషన్ స్వీకరణ సమయంలో వేలిముద్రలు వేయాల్సి ఉంటుంది.

ఎన్నికల పరిశీలకుల నియామకం

12 చోట్ల ఆర్‌ఓ కార్యాలయాలు -IIలో▸

చిన్న పొరపాటున్నా తిరస్కరణే

- నామినేషన్ పత్రాలు జాగ్రత్తగా నింపాలి
- ఏ ఒక్క కాలమ్ వదిలిపెట్టొద్దు -IIలో▸

జంగ్ తెలంగాణ

నిబంధనల మేరకు పనిచేయాలి

- కలెక్టర్ భవేష్ మిశ్రా
- నేడు ఎన్నికల పరిశీలకుడి పర్యటన



అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్

భూపాలపల్లి: జిల్లాలో అసెంబ్లీ ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు అధికారులు పనిచేయాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి భవేష్‌మిశ్రా అన్నారు. ఎన్నికల నిర్వహణపై సంబంధిత ఎన్నికల నోడల్ అధికారులతో గురువారం సమీకృత కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎన్నికల విధులను ప్రతిఒక్కరూ జాగ్రత్తగా నిర్వహించాలన్నారు. 1950 కాల్ సెంటర్, సీ విజిల్ యాప్ ద్వారా వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయి అధికారులకు తెలియజేస్తూ అప్రమత్తం చేయాలని చెప్పారు. నేటినుంచి మూడు రోజులపాటు ఎన్నికల పరిశీలకులు కౌశిక్‌రాయ్ భూపాలపల్లి అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో పర్యటిస్తారని తెలిపారు. ఎన్నికల పరిశీలకుల పర్యటన నేపథ్యంలో ఖర్చులు, రిజిస్టర్లు, నివేదికలు సిద్ధం చేయాలన్నారు. ఎన్నికల వ్యయ పరిశీలకుల పర్యటన జిల్లాలో మూడుసార్లు ఉంటుందని చెప్పారు. నవంబర్ 3నుంచి నవంబర్ 5వరకు మొదటిసారి, నవంబర్ 9నుంచి నవంబర్ 30 మధ్యలో రెండోసారి, డిసెంబర్ 2నుంచి డిసెంబర్ 5 మధ్యలో మూడోసారి ఎన్నికల పరిశీలకుల పర్యటన ఉంటుందని చెప్పారు. ఇందుకు అవసరమైన సదుపాయాలు ఏర్పాటు చేయాలని సూచించారు. నూతన ఓటర్లకు ఓటరు గుర్తింపు కార్డులు పంపిణీచేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పెండింగ్ ఓటరు నమోదు దరఖాస్తులను త్వరితగతిన క్షేత్రస్థాయిలో విచారణ పూర్తిచేసి పరిష్కరించాలని తెలిపారు. జిల్లాలో అందుబాటులో ఉన్న ఈవీఎం, బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్ల వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. సెక్టార్ అధికారులకు నవంబర్ 20నుంచి అవసరమైన వాహనాలు ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఆర్డీఓ రమాదేవి, ఎన్నికల నోడల్ అధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

పోలీసులు అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలి

ఎస్పీ కిరణ్‌ఖరే



చెక్‌పోస్టు పరిశీలిస్తున్న ఎస్పీ కిరణ్‌ఖరే, ఓఎస్డీ

కాళేశ్వరం: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో జిల్లా పోలీసులు, పారామిలటరీ బలగాలు అప్రమత్తంగా, సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని ఎస్పీ కిరణ్ ఖరే అన్నారు. గురువారం ఆయన ఓఎస్డీ అశోక్‌కుమార్‌తో కలిసి జిల్లాలోని మహదేవపూర్ మండలం కాళేశ్వరం అంతర్రాష్ట్ర వంతెన వద్ద ఏర్పాటుచేసిన బార్డర్ చెక్‌పోస్టు, పోలీసుస్టేషన్‌లతో పాటు సీఆర్‌పీఎఫ్ క్యాంపును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రతిఒక్కరూ అంకిత భావంతో పనిచేయాలన్నారు. సరిహద్దు పోలీసులతో సమన్వయంతో పనిచేస్తూ మావోయిస్టులతో ఎలాంటి ఘటనలు జరుగకుండా భద్రత చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళిని కట్టుదిట్టంగా అమలు చేస్తున్నామన్నారు. నగదు, మద్యం, ఉచిత పంపిణీలపై నిఘా ఉంటుందని పేర్కొన్నారు. సరైన ఆధారాలు లేకుండా రూ.50వేల కంటే ఎక్కువగా నగదు తీసుకెళ్తే సీజ్ చేస్తామన్నారు. పెళ్లిళ్లు, కాలేజీ ఫీజులు, వైద్యం, వ్యాపారం కోసం తీసుకువెళ్లే నగదుకు సరైన పత్రాలతో ఆధారాలు చూపాలన్నారు. చెక్‌పోస్టు వద్ద అధికారులు, సిబ్బంది పకడ్బందీగా తనిఖీలు చేపట్టాలని సూచించారు. ప్రతి వాహనాన్ని తనిఖీ చేయడంలో అప్రమత్తంగా వ్యవహరించాలని ఎస్పీ తెలిపారు. ఆయన వెంట ఎస్సై లక్ష్మణ్‌రావు, సీఆర్‌పీఎఫ్ ఎస్సై రామకృష్ణ ఉన్నారు.

'కాళేశ్వరంపై పూర్తి విచారణ జరపాలి'

సీఎల్పీ నేత భట్టి విక్రమార్క

కాళేశ్వరం: కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ(లక్ష్మీ) బ్యారేజీలో వంతెనతో పాటు పిల్లర్లు కుంగిన విషయమై కేంద్రం పూర్తిస్థాయిలో విచారణ చేయాలని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క డిమాండ్ చేశారు. రాహుల్‌గాంధీతో కలిసి గురువారం బ్యారేజీని వీక్షించారు. అనంతరం భట్టి విక్రమార్క మాట్లాడుతూ కేంద్ర బృందం నిశితంగా పరిశీలించి నివేదికలు అందజేయాలన్నారు. లక్ష కోట్ల అవినీతి జరిగినా సీఎం స్పందించడం లేదని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక బాధ్యులపై చర్యలు తప్పకుండా తీసుకుంటామని తెలిపారు. బాధ్యులపై కేంద్రం చర్యలు తీసుకోవాలన్నారు.

నాసిరకం.. నాణ్యతాలోపం..



కాళేశ్వరం ప్రాజెక్టు పరిధి సుందిళ్ల, అన్నారం, మేడిగడ్డ బ్యారేజీలు నాసిరకం, నాణ్యత లోపాలు ఉన్నాయని, అక్కడక్కడా బయటపడుతున్నాయని మంథని ఎమ్మెల్యే డి.శ్రీధర్ బాబు అన్నారు. కాళేశ్వరం పేరుతో కేసీఆర్ ప్రభుత్వం ప్రజాధనాన్ని వృధా చేసిందన్నారు. బ్యారేజీలో పిల్లర్లు, వంతెన కుంగినా ఇప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. కేంద్ర బృందం పర్యటించినా నివేదికలు ఇవ్వకపోవడంపై అనుమానాలు ఉన్నాయన్నారు. రైతులకు పంట నష్టం ఐదేళ్లుగా ఇవ్వడం లేదన్నారు.

మహిళా సాధికారతకు జై

బీఆర్ఎస్ అవినీతిని ఎండగడుతూ కాంగ్రెస్ సంక్షేమ పథకాలను ఉటంకించిన రాహుల్

- ప్రతీ మహిళ నెలకు రూ.4వేలు ఆదా చేసుకునేలా చూస్తామని హామీ
- రాష్ట్రం కోసం, కుటుంబం కోసం కష్టపడేది మహిళలేనంటూ పొగడ్తలు
- మహిళా సాధికారత సభలో ప్రసంగం.. ఉత్సాహంలో కేడర్
- 15 రోజుల వ్యవధిలో ఉమ్మడి జిల్లాలో రెండోసారి పర్యటన
- మేడిగడ్డ బ్యారేజీని పరిశీలించిన రాహుల్‌గాంధీ
- ప్రజాప్రతినిధులను అనుమతించకపోవడంతో ఉద్రిక్తత



మహిళా సాధికారత సభలో మాట్లాడుతున్న రాహుల్‌గాంధీ, పక్కన దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



సభకు హాజరైన మహిళలు, మేడిగడ్డ ప్రాజెక్టును పరిశీలిస్తున్న రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డి

కాళేశ్వరం: 'రాష్ట్రం, కుటుంబం కోసం కష్టపడేది మహిళలు. వారికి న్యాయం జరిగేలా పథకాలు అమలు చేస్తాం. నెలకు రూ.4వేలు ఆదా చేసుకునేలా చూస్తాం' అని ఏఐసీసీ అగ్రనేత, కాంగ్రెస్ పార్టీ జాతీయ ఉపాధ్యక్షుడు రాహుల్‌గాంధీ చెప్పుకొచ్చారు. మరోవైపు కాళేశ్వరం ప్రాజెక్టు బీఆర్ఎస్‌కు, కేసీఆర్ కుటుంబానికి ఏటీఎంగా మారిందని విమర్శలు గుప్పించారు. 15 రోజుల వ్యవధిలోనే ఆయన ఉమ్మడి జిల్లాలో రెండు సార్లు పర్యటించడంతో కాంగ్రెస్ శ్రేణుల్లో జోష్ కనిపించింది. గురువారం మహదేవపూర్ మండలం అంబట్‌పల్లిలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహిళా సాధికారత సభకు హాజరయ్యారు. స్టేజీపై రాహుల్ హిందీలో ప్రసంగించగా.. మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలుగులో అనువదించారు. ముఖ్యంగా కాళేశ్వరం ప్రాజెక్టులో జరుగుతున్న అవినీతి చూసేందుకు నేరుగా ఇక్కడికి వచ్చానన్నారు. ప్రాజెక్టు నిర్మాణంతో ఈ ప్రాంత ప్రజలకు ఒక చుక్కనీరు లేదు, ఒక్క రూపాయి లాభం లేదన్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో పెట్టిన ఆరు గ్యారంటీలు తప్పకుండా అమలు చేస్తామన్నారు. కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వస్తే బాగుపడేది మహిళలే అన్నారు. ఆర్టీసీ బస్సు ప్రయాణం ఉచితం చేసి, గ్యాస్ సిలిండర్ రూ.500లకే అందజేయడంతో పాటు ప్రతీ నెలా మహిళల అకౌంట్‌లోకి రూ.2,500 జమ చేస్తామని చెప్పుకొచ్చారు. తెలంగాణలో రాబోయేది ప్రజల సర్కార్ అన్నారు. మహదేవపూర్, కాటారం, పలిమెల, భూపాలపల్లి జిల్లాలో నుంచే కాకుండా పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల నుంచి కూడా నాయకులు, కార్యకర్తలు తరలివచ్చారు. అంబట్‌పల్లి, మేడిగడ్డ వద్ద ఆయన 1.12 గంటల పాటు ఉన్నారు. కాంగ్రెస్ భూపాలపల్లి అభ్యర్థి గండ్ర సత్యనారాయణరావు, భూపాలపల్లి, పెద్దపల్లి డీసీసీ అధ్యక్షుడు ప్రకాశ్‌రెడ్డి, కొమురయ్య, విజయరమణారావు, రాజయ్య, కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, శశిభూషణ్ కాచే, కాటారం ఎంపీపీ సమ్మయ్య, అక్బర్‌ఖాన్, కోట రాజబాపు ఉన్నారు.



నాయకులను అడ్డుకుంటున్న పోలీసులు

బ్యారేజీ వద్ద ఉద్రిక్త పరిస్థితి..

అంబట్‌పల్లిలోని మహిళా సాధికారత సభాస్థలి నుంచి నేరుగా రాహుల్‌గాంధీ మేడిగడ్డ(లక్ష్మీ)బ్యారేజీ పరిశీలనకు ముఖ్య నాయకులతో కలిసి వెళ్లారు. దీంతో కొంతమంది స్థానిక ప్రజాప్రతినిధులు కూడా బ్యారేజీ సందర్శనకు వెళ్లేందుకు ప్రయత్నించారు. దీంతో ఓ డీఎస్పీ స్థాయి పోలీసు అధికారి అంబట్‌పల్లి సర్పంచ్ విలాస్‌రావును తోసేయడంతో ఘర్షణ మొదలైంది. పోలీసులు అంబట్‌పల్లి వద్ద వారిని నిలువరించారు. దీంతో ఆగ్రహించిన కొంతమంది కాంగ్రెస్ నాయకులు, ఎంపీపీ రాణిబాయి, జెడ్పీటీసీ అరుణ, మాజీ ఎంపీపీ సత్తమ్మ, కార్యకర్తలు.. బారికేడ్లు, పోలీసులను తోసుకుంటూ ముందుకెళ్లారు. బ్యారేజీ వద్దకు చేరుకున్న వీరిని అప్పటికే అక్కడున్న పోలీసులు అతికష్టం మీద అడ్డుకున్నారు. దీంతో ప్లకార్డులు పట్టుకొని సీఎం, బీఆర్ఎస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ.. అరగంట పాటు రోడ్డుపై బైఠాయించారు. దీంతో బ్యారేజీ వద్ద టెన్షన్ వాతావరణం నెలకొంది. పోలీసులు ప్రత్యేక బలగాలతో పాటు స్పెషల్‌పార్టీ పోలీసులు, సీఆర్పీఎఫ్ సిబ్బంది సాయంతో వారిని వెనక్కి పంపించారు. తోపులాటలో కాటారం సర్కిల్ సీఐ, ఎస్సైలు కిందపడినట్లు తెలిసింది. రాహుల్‌గాంధీ వెళ్లిపోయాక కొద్దిసేపటి తర్వాత నాయకులు, కార్యకర్తలు కూడా తిరుగుముఖం పట్టడంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు.

300మంది పోలీసులు..

రాహుల్‌గాంధీ సభ నేపథ్యంలో జిల్లా ఎస్పీ కిరణ్‌ఖరే ఆధ్వర్యంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. 300 మంది పోలీసులతో ముఖ్యంగా బ్యారేజీపైకి కార్యకర్తలు, నాయకులు వెళ్లకుండా రోప్ పార్టీలను అందుబాటులో ఉంచారు. బారికేడ్లు పెట్టి ఎక్కడి వాహనాలు అక్కడే నిలిపేశారు.

రాహుల్ పర్యటన సాగిందిలా..

- **ఉదయం 8.17 గంటలకు:** హైదరాబాద్ నుంచి నేరుగా మేడిగడ్డ బ్యారేజీ హెలిపాడ్ వద్ద ల్యాండింగ్ అయ్యారు.
- **8.23గంటలకు:** రాహుల్‌గాంధీకి స్వాగతం.
- **8.30గంటలకు:** ప్రత్యేక కాన్వాయ్‌లో అంబట్‌పల్లిలోని ఎల్‌అండ్‌టీ క్యాంపు కార్యాలయం ఆఫీస్‌కు చేరుకున్నారు.
- **8.36గంటలకు:** ఎల్‌అండ్‌టీ క్యాంపు కార్యాలయం నుంచి సభాస్థలికి చేరుకున్నారు.
- **8.40గంటలకు:** మహిళా సదస్సు స్టేజీపైకి వచ్చి ప్రసంగించారు.
- **8.52గంటలకు:** ప్రసంగం ముగించి తిరిగి మేడిగడ్డ బ్యారేజీకి వెళ్లారు.
- **9.02 గంటలకు:** రాహుల్‌గాంధీ కాన్వాయ్ మేడిగడ్డ బ్యారేజీకి చేరింది.
- **9.26గంటలకు:** బ్యారేజీ పరిశీలన తర్వాత హెలికాప్టర్ ఎక్కారు.
- **9.29 గంటలకు:** ఏరియల్ వ్యూ ద్వారా బ్యారేజీ దెబ్బతిన్న ప్రాంతాన్ని వీక్షించి హైదరాబాద్‌కు వెళ్లారు.

సమస్యల స్వాగతం
జనగామ నియోజకవర్గంపై 'సాక్షి' గ్రౌండ్ రిపోర్ట్

ఓటు వజ్రాయుధం
యువ ఓటర్ల మనోగతం

'కోడ్' ఉల్లంఘన
- వివరాలు IIలో▸

చిన్న పొరపాటున్నా తిరస్కరణే



అభ్యర్థులు నామినేషన్ పత్రాలు జాగ్రత్తగా నింపాలి
- కాలమ్స్‌ను ఖాళీగా వదిలేయొద్దు
- ఆర్‌ఓ కార్యాలయాల్లో హెల్ప్ డెస్క్‌ల ఏర్పాటు
- నేటి నుంచి నామినేషన్లు ప్రారంభం

వర్ధన్నపేట : అసెంబ్లీ ఎన్నికల్లో ప్రధాన ఘట్టం నామినేషన్ల ప్రక్రియ. ఈ కీలక ఘట్టం శుక్రవారం నుంచి ప్రారంభం కానుంది. నామినేషన్లు దాఖలు చేసే సమయంలో కొంత మంది అభ్యర్థులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ పొరపాట్లు చేస్తుంటా రు. దీని వల్ల వారి నామినేషన్లు తిరస్కరణకు గురవు తాయి. ఈ నేపథ్యంలో నామినేషన్లకు సంబంధించి ఎన్నికల కమిషన్ నిబంధనలు విధించింది. ఈ నిబంధనలపై ప్రతి అభ్యర్థికి అవగాహన ఉండాలి.

నిబంధనలు ఇవీ..

నామినేషన్ పత్రం ఫారం–2(బీ)లో సమర్పించాలి. నామినేషన్ పత్రంపై అభ్యర్థి తప్పనిసరిగా సంతకం చేయాలి. అసెంబ్లీ ఎన్నికల్లో నామినేషన్ వేసే జనరల్ అభ్యర్థులు రూ. 10 వేలు, ఎస్సీ, ఎస్టీ రూ. 5 వేలు డిపాజిట్ చేయాలి. కుల ధ్రువీకరణ పత్రాలు సమర్పించాలి. నగదు లేదా చలాన్ మాత్రమే సమర్పించాల్సి ఉంటుంది. డీడీలు, చెక్కులు అనుమతించరు. అభ్యర్థులు ఒకే డిపాజిట్‌పై నాగులు సెట్ల నామినేషన్ పత్రాలు దాఖలు చేసే అవకాశం ఉంటుంది. అభ్యర్థులు భారతీయ పౌరులై ఉండాలి. 25 ఏళ్ల వయసు నిండి ఉండాలి. రిజర్వ్ నియోజకవర్గమైతే అందుకు తగిన అర్హత ఉండాలి. ఒక అభ్యర్థి రెండు నియోజకవర్గాల్లో మాత్రమే నామినేషన్ వేసేందుకు అవకాశం ఉంటుంది. అభ్యర్థులు ప్రత్యేక బ్యాంకు ఖాతా తెరిచి అందులో నుంచి ఎన్నికల ఖర్చు చేయాలి. నామినేషన్ దగ్గర నుంచి.. పోలింగ్ వరకు అయ్యే మొత్తం ఖర్చు ఎన్నికల రిటర్నింగ్ అధికారికి లెక్క చూపాలి. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులను నామినేషన్ సమయంలో ఇతరులు ప్రతిపాదించాల్సి ఉంటుంది. అభ్యర్థులు గుర్తింపు పొందిన పార్టీ వారైతే ఒకరు ప్రతిపాదించాల్సి ఉంటుంది. గుర్తింపు లేని పార్టీలు స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేస్తే పది మంది ఇతరులు ప్రతిపాదించాలి. పోటీ చేసే అభ్యర్థులు రాష్ట్రంలో ఎక్కడైనా ఓటు హక్కు కలిగి ఉండాలి. దీనికి సంబంధించిన అటెస్టెడ్ ప్రతిని రిటర్నింగ్ అధికారికి సమర్పించాలి. ప్రతిపాదకులు మాత్రం అభ్యర్థి పోటీ చేసే నియోజకవర్గానికి చెందిన ఓటర్లు అయి ఉండాలి. ఉద్యోగం నుంచి తొలగింపబడిన వారు పోటీ చేయాలనుకుంటే సదరు ఉద్యోగం నుంచి ఎందుకు తొలగించారో తప్పనిసరిగా సంబంధిత పత్రాలు సమర్పించాల్సి ఉంటుంది. నామినేషన్ పత్రాలు నింపడంలో సలహాలు, సూచనలు ఇచ్చేందుకు ప్రతి రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేశారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలు సమర్పించే సమయంలో అభ్యర్థితో పాటు మరో నలుగురిని మాత్రమే అనుమతిస్తారు.

ప్రతి కాలమ్ నింపాల్సిందే..

అభ్యర్థి నామినేషన్ పత్రంలోని ప్రతి కాలమ్ తప్పనిసరిగా నింపాల్సి ఉంటుంది. ఆ కాలమ్‌లో నింపాల్సింది లేకపోతే లేదు, వర్తించదు అని రాయాలి. అంతే కాని డ్యాష్(–) వంటి సింబల్ రాయొద్దు. ఏ కాలమ్ కూడా ఖాళీగా వదిలేయొద్దు. భారత ఎన్నికల సంఘం నిర్దేశించిన ఫారం–28 నోటరైజ్డ్ అఫిడవిట్‌లో అన్ని కాలమ్స్ నింపాలి.

అఫిడవిట్ కీలకం

నామినేషన్ వేసే ప్రతి అభ్యర్థి తనపై ఉన్న క్రిమినల్ కేసుల వివరాలను అఫిడవిట్‌లో పొందుపరచాలి. వాటి వివరాలు నవంబర్ 15వతేదీ లోగా స్థానిక దినపత్రికల్లో మూడు సార్లు ప్రకటనలు ప్రకటనలు చేయాలి. అదే విధంగా చానళ్లలో మూడు సార్లు ప్రసారం చేయాలి. దినపత్రికలు, చానళ్లలో వచ్చిన ప్రకటనల రశీదులను రిటర్నింగ్ అధికారులకు సమర్పించాలి. నామినేషన్ ఫారం–26 అఫిడవిట్ జత పరచాల్సి ఉంటుంది. రూ. 10 నాన్ జుడీషియల్ స్టాంప్ పేపర్‌పై అఫిడవిట్ సమర్పించాలి. అభ్యర్థి రెండు స్టాంప్ సైజ్ ఫొటోలను ఒకటి నామినేషన్ ఫారంపై, రెండోది అఫిడవిట్‌పై అంటించాలి. అదనంగా నాలుగు లేటెస్ట్ పాస్ పోర్టు సైజు ఫొటోల వెనక వైపు అభ్యర్థి లేదా ఎన్నికల ఏజెంట్ సంతకం చేసి సమర్పించాలి. అఫిడవిట్‌పై మొదటి తరగతి మెజిస్ట్రేట్ లేదా నోటరీతో అటెస్ట్ చేయించాలి. అలాగే నో డ్యూ సర్టిఫికెట్, ప్రమాణం చేసే సర్టిఫికెట్, సర్టిఫైడ్ ఎక్స్‌ట్రాక్ట్ పత్రాలు జతపరచాలి.

ఫారం– ఏ, ఫారం–బీ సమర్పించాలి

రాజకీయ వర్గాల తరఫున పోటీ చేసే అభ్యర్థులు ఫారం–ఏ, ఫారం –బీ పత్రాలను నామినేషన్ చివరి రోజు నవంబర్ 10వ తేదీ మధ్యాహ్నం 3 గంటలలోపు రిటర్నింగ్ అధికారికి సమర్పించాలి. ఈ సమయంలోగా సమర్పించని వారిని స్వతంత్ర అభ్యర్థులుగా పరిగణిస్తారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థి బ్యాలెట్ పేపర్ ఎలా ఉండాలనేది ముందుగానే రాసి ఇవ్వాలి. ముందు జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన పార్టీల అభ్యర్థులు, రాష్ట్ర స్థాయి గుర్తింపు పొందిన పార్టీల అభ్యర్థులు, ఆ తర్వాత స్వతంత్రులుగా పోటీ చేసే అభ్యర్థుల పేర్లను చేరుస్తారు.

ఈ ముచ్చటెరికేనా?

బొగ్గు గనులు, డిపార్ట్‌మెంట్ల వద్ద ప్రచారం నిషేధం



భూపాలపల్లి అర్బన్ : అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా సింగరేణి గనులు, డిపార్ట్‌మెంట్ల వద్ద ప్రచారం నిషేధించారు. ఈ మేరకు సింగరేణి యాజమాన్యం ఉత్తర్వులు జారీ చేసింది. సంస్థ.. ఈ ఏడాది 72 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని నిర్దేశించుకోగా, ఎన్నికల ప్రచారానికి అనుమతిస్తే కార్మికుల పని గంటలు వృథా అవుతాయనే భావనతో ఈ నిర్ణయం తీసుకుంది. ఈ విషయమై యాజమాన్యం సింగరేణి వ్యాప్తంగా జీఎం కార్యాలయాలకు ఇటీవల ఉత్తర్వులు జారీ చేసి పటిష్టంగా అమలు చేయాలని సూచించింది. ఇందుకోసం సెక్యూరిటీని అప్రమత్తం చేయాలని ఆదేశించింది. నిబంధనలు ఉల్లంఘించి ఎవరైనా ప్రచారం చేస్తే చర్యలు తీసుకోవడమే కాక, ఉద్యోగులు సహకరించినా శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొంది.

రూ.25 లక్షలు సీజ్

జనగామ: యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు ఏపీజీవీబీకి చెందిన రూ.25 లక్షలు సీజ్ చేసినట్లు ఎస్పై సృజన్ తెలిపారు. జిల్లా కేంద్రం క్లాక్ కమాన్ వద్ద శుక్రవారం తనిఖీల్లో భాగంగా నగదు పట్టుకున్నట్లు స్పష్టం చేశారు. జనగామ బ్రాంచ్ నుంచి ఆలేరుకు నగదు తరలిస్తున్న క్రమంలో సరైన పత్రాలు లేకపోవడంతో పట్టుకుని ఐటీ మానిటరింగ్ విభాగానికి అప్పగించినట్లు పేర్కొన్నారు.



సమస్యల స్వాగతం..

భవిష్యత్తు ఎమ్మెల్యేకు భారీ సవాళ్ల కిరీటం
- బలంగా చేర్యాల రెవెన్యూ డివిజన్ నినాదం
- ఆయకట్టుకు వందశాతం అందని సాగునీరు
- తండాలకు బీటీ రోడ్లు, రంగప్ప చెరువు సుందరీకరణ
- 'జనగామ'లో సీటీస్కాన్, ప్రభుత్వ పాలిటెక్నిక్, నర్సింగ్, పీజీ కళాశాల డిమాండ్



కంకర తేలి అధ్వానంగా మారిన జనగామ మండలంలోని బాచ్చా తండా రోడ్డు

గ్రాండ్ రిపోర్ట్ జనగామ

జనగామ : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నిరాదరణకు గురై స్వరాష్ట్రంలో ఇప్పుడిప్పుడే అభివృద్ధి వైపు అడుగులు వేస్తున్న జనగామ నియోజకవర్గంలో పలు సమస్యలు భవిష్యత్తు ఎమ్మెల్యేకు స్వాగతం పలుకుతున్నాయి. కొత్త ప్రభుత్వ ఏర్పాటు అనంతరం నియోజకవర్గంలోని జనగామ, నర్మెట, తరిగొప్పుల, బచ్చన్నపేట, చేర్యాల, మద్దూరు, దూల్మిట్ట, కొమురవెల్లి ఎనిమిది మండలాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలు, హామీలు, ఇతర అంశాలపై 'సాక్షి' ప్రత్యేక కథనం.

జనగామ పట్టణ ప్రజల డిమాండ్లు..

జిల్లాలోని 12 మండలాలతో పాటు సమీప ప్రాంతాలకు చివరి ఆయకట్టు వరకు సాగునీరు, దేవాదుల కాలువల అసంపూర్తి నిర్మాణ పనులు చేపట్టాల్సి ఉంది. ఇప్పటి వరకు 70 శాతం కాలువల నిర్మాణ పనులు పూర్తి చేసి, 1.98 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగు నీరు అందిస్తుండగా, 30 శాతం పనులు పూర్తి చేస్తే, మరో లక్ష ఎకరాలు సాగులోకి వస్తాయి. అలాగే, కొన్ని సంవత్సరాల నుంచి చేర్యాల రెవెన్యూ డివిజన్ కోసం ప్రజలు ఉద్యమాలు చేస్తున్నారు. జనగామ జిల్లా ఆస్పత్రిలో సీటీ స్కాన్ సేవలు మూలకుపడడంతో పేదలకు ఆర్థికభారం అవుతోంది. జి ల్లా కేంద్రంలో ప్రభుత్వ పాలిటెక్నిక్, పీజీ, నర్సింగ్ కళాశాలల హామీలు నెరవేర్చాల్సి ఉంది. రంగప్ప చెరువు ఆధునీకరణ, మున్సిపల్ ఫిల్టర్ బెడ్ నుంచి లక్షలు ఖర్చు చేస్తూ తాగునీరు సరఫరా చేస్తున్నా ప్ర జలు ఆ నీటిని తాగడం లేదు. ఫిల్టర్ బెడ్ నీటిని తా గేలా చూసి ప్రైవేట్ నీటి వ్యాపారానికి చెక్ పెట్టాలి. జనగామలో ఎస్పీ ఆఫీస్ డిమాండ్ ఉంది. ఆర్‌అండ్‌బీ అతిథి గృహం జంక్షన్ అభివృద్ధి హామీ మిగి లింది. డ్రైనేజీల నిర్వహణ, సీసీ రోడ్ల నిర్మాణం, మినీ స్టేడియం అభివృద్ధి తదితర సమస్యలు నూతన ఎమ్మెల్యేకు స్వాగతం పలుకుతున్నాయి.

జనగామ మండలం..

బొమ్మకూరు, చీటకోడూరు రిజర్వాయర్ల నుంచి విడుదల చేసే నీటి ద్వారా 4,500 ఎకరాలు సాగు చేస్తున్నారు. గత ఏడాది బొమ్మకూరు రిజర్వాయర్ ఎండిపోవడంతో అడవికేశ్వాపూర్, గోపరాజుపల్లి, గానుగుపహాడ్ తదితర గ్రామాల్లో 2,500 ఎకరాల్లో పంటలు ఎండిపోయాయి. జనగామ–నర్మెట ప్రధాన రహదారి గానుగుపహాడ్ ఎక్స్‌రోడ్డు సమీపంలో కల్వర్టు కొట్టుకుపోవడంతో ప్రయాణం నరకంగా మారింది. శామీర్‌పేట–సిద్దెంకి, ఎర్రకుంట తండా, మరిగడి, బాచ్యాతండా, రోడ్డు నిర్మాణ పనులు కలగానే మిగిలాయి.

దూల్మిట్ట ..

జనగామ నియోజకవర్గం.. ప్రస్తుత సిద్దిపేట జిల్లాలోని దూల్మిట్ట మండలంలో లింగాపూర్ చెక్ డ్యాముల మరమ్మతులు, బెక్కల్ నుంచి కూటిగల్ గ్రామం వరకు బీటీ రోడ్డు హామీ నెరవేర్చాల్సి ఉంది. ఉమ్మడి కొండాపూర్ గ్రామాల సరిహద్దు తండాలకు అంతర్గ రోడ్ల నిర్మాణం చేపట్టాల్సి ఉంది.

కొమురవెల్లి ..

ఇటీవల కొమురవెల్లి మండలం ఏర్పాటు చేశారు. కానీ నేటికి మండల పరిషత్, తహసీల్, ఇతర ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటు చేయలేదు. అద్దె గద్దుల్లోనే నెట్టుకొస్తున్నారు.

బచ్చన్నపేట..

15 సంవత్సరాల నుంచి బచ్చన్నపేట మండలంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలనే డిమాండ్ వినిపిస్తోంది. దేవాదుల మినీ కాలువల పనులను గాలికొదిలేశారు. సీహెచ్‌సీ(30 పడకలు) దవాఖాన ఉన్నా పూర్తి స్థాయి సేవలు అందుబాటులోకి రాలేదు. ఉపాధి లేక రోజు వందలాది మంది నిరుద్యోగులు హైదరాబాద్ వెళ్తున్నారు.

తరిగొప్పుల ..

తరిగొప్పులలో తహసీల్, ఎంపీడీవో, పోలీస్‌స్టేషన్‌కు సొంత భవనాలు లేవు. ప్రభుత్వ జూనియర్ కళాశాల హామీ మాటలకే పరిమితమైంది. అంకుషాపూర్ పంచాయతీ నుంచి తండాలకు రోడ్డు సౌకర్యం లేదు. తండాలను జీపీలుగా చేసినా బస్సు సౌకర్యం కల్పించడం లేదు.

నర్మెట ..

నర్మెట మండలంలో మూడేళ్ల నుంచి 108 సేవలు అందుబాటులో లేవు. ఆగాపేట, రత్నతండా, అనేక గ్రామాల పరిధిలో రోడ్లు అధ్వానంగా మారి నరకం చూపిస్తున్నాయి. బొమ్మకూరు రిజర్వాయర్ నుంచి ఓపెన్ కెనాల్ ద్వారా మల్కాపేట, మచ్చుపహాడ్‌కు సాగునీరు అందించే ప్రయత్నం ముందుకు సాగడ లేదు. నర్మెట, అమ్మాపూరం, వెల్దండ ఉన్నత పాఠశాలలతో పాటు అనేక స్కూళ్లు శిథిలావస్థకు చేరి ప్రమాదాన్ని హెచ్చరిస్తున్నాయి.

చేర్యాల పట్టణ వ్యూ



చేర్యాల మండలం..

చేర్యాల రెవెన్యూ డివిజన్ ఏర్పాటు డిమాండ్‌తో పాటు పట్టణంలోని పెద్ద చెరువు సుందరీకరణ చేపట్టాలి. మున్సిపల్ సమీకృత భవన నిర్మాణ పనులు పెండింగ్‌లో ఉన్నాయి. వెజ్ అండ్ నాన్ వెజ్ మార్కెట్, అసంపూర్తి దేవాదుల కాల్వల పనులు, కడవేర్గు గ్రామ శివారులో లోలెవల్ బ్రిడ్జి, వేచరేణి గ్రామ శివారులో వాగుపై వంతెన నిర్మాణం చేయాల్సి ఉంది.

మద్దూర్ మండలం..

అసంపూర్తి దేవాదుల కాలువ నిర్మాణ పనులు, లక్కపల్లి నుంచి పిట్టలగూడెం వరకు రోడ్డు నిర్మాణం హామీ నేటికి నెరవేరలేదు.



అసంపూర్తిగా దర్శనమిస్తున్న ఐనాపూర్ పెద్ద చెరువు నుంచి రాంసాగర్ వరకు నిర్మిస్తున్న దేవాదుల కాలువ

రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలి



చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, దూల్మిట్ట మండలాలను కలిపి చేర్యాలను రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలి. పెద్ద చెరువు సుందరీకరణ, సమీకృత భవన నిర్మాణ పనులు, ప్రభుత్వ పీజీ, ఇంజనీరింగ్ కళాశాలలు,ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలల్లో అధ్యాపకుల నియామకం చేపట్టాలి.

–రామగళ్ల నరేష్, చేర్యాల

తండాకు రోడ్డు కావాలి



నర్మెట నుంచి ఇప్పలగడ్డ జీపీ పరిధిలో రత్న తండాకు రోడ్డు సౌకర్యం కల్పించాలి. అత్యవసర సమయంలో అంబులెన్స్ కూడా చేరుకోలేని పరిస్థితి. స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలైనా తండాలకు రోడ్డు సౌకర్యం కల్పించడం లేదు

–రెడ్యానాయక్, రత్నతండా, నర్మెట

అభివృద్ధిపై స్పష్టమైన హామీ ఇవ్వాలి



మండలంలో దేవాదుల కాలువల నిర్మాణం పూర్తి చేయాలి. ప్రభుత్వ జూనియర్ కళాశాల మంజూరు హామీ నెరవేర్చాలి. ఓటు కోసం మా వద్దకు వచ్చే అభ్యర్థులు అభివృద్ధిపై స్పష్టమైన హామీ ఇవ్వాలి.

–వద్ది వెంకటయ్య, గోపాల్ నగర్, బచ్చన్నపేట

అంబులెన్స్‌ చేరుకోవాలన్నా కష్టమే



ఎర్రగొల్ల పహాడ్ గ్రామపంచాయతీ పరిధిలోని అజ్మీర్ తండాకు బీటీ రోడ్డు లేదు. కంకర తేలి, గుంతలమయంగా మారిన రహదారిపై అంబులెన్స్ చేరుకోవాలంటే కష్టంగా ఉంది. ఎర్రగుంట తండా, సుందరయ్య నగర్‌కు బీటీ రోడ్ల నిర్మాణం చేయాలి.

–మీరా రమేష్, అజ్మీర్ తండా, ఎర్రగొల్లపహాడ్ ,జనగామ

ఓటు.. వజ్రాయుధం



- నిజాయితీగా వేటు వేస్తాం.. మంచి నాయకుడిని ఎన్నుకుంటాం
- ఎన్నికల నేపథ్యలో యువ ఓటర్ల మనోగతం

ఖిలా వరంగల్: ఓటు.. వజ్రాయుధం. దేశ భవిష్యత్‌ను మార్చేది శక్తి కేవలం ఓటుకే ఉంటుంది. అందుకే బుల్లెట్ కంటే బ్యాలెట్ మిన్నా అంటారు. దీనిని సక్రమంగా వినియోగించడం ద్వారా మన భవిష్యత్‌ను మనమే నిర్ణయించుకునే సువర్ణావకాశం ఉంటుంది. ఓటు హక్కు పొందడానికి 18 సంవత్సరాలు నిండాలి. కాగా, ఇటీవల నిర్వహించిన కార్యక్రమంలో అనేక మంది యువతి, యువకులు ఓటరు జాబితాలో తమ పేర్లను నమోదు చేయించుకున్నారు. ఇందులో విద్యార్థులే అధికంగా ఉన్నారు. ఓటు వేసే ముందు నాయకులు అందించే ప్రోత్సాహకాలకు లొంగకుండా నిజాయితీగా వినియోగించుకోవాలి. మన ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తారనే నమ్మకమున్న నాయకుడికే ఓటు వేయాలి. ఎన్నికల నేపథ్యంలో పలువురు ఓటర్లు తమ మనోగతాన్ని 'సాక్షి'తో పంచుకున్నారు. ఆ వివరాలు వారి మాటల్లోనే..

యువతతోనే మార్పు



యువత రాజకీయాల్లోకి వస్తేనే మార్పు వస్తుంది. సమాజంపై అవగాహన పెంచుకుని అవినీతిలో కూరుకుపోయిన రాజకీయాలను తరిమికొట్టాలి. రానున్న ఎన్నికల్లో యువత నడుం బిగించాలి

– ఎం. మిథిలా విద్యార్థిని

అవినీతి రహిత పాలన అందించాలి



అవినీతి రహిత పాలన అందించే నాయకులనే ఎన్నుకోవాలి. ఎన్నికల్లో హామీలు ఇచ్చి అనంతం మొఖం చాటేసే వ్యక్తులకు గుణపాఠం చెప్పాలి. ఎన్నికలంటే డబ్బు కాదని నిరూపించాలి. భవిష్యత్తు బంగారమయం చేసుకోవాలి.

– డాక్టర్ సృజనఫోర్ట్‌రోడ్డు వరంగల్

మంచి నాయకుడిని ఎన్నుకోవాలి



నిత్యం ప్రజల మధ్యలో ఉండే నాయకులనే ఎన్నుకోవాలి. సంపాదనే ధ్యేయంగా చాలా మంది రాజకీయాల్లోకి వస్తున్నారు. రాజకీయం వ్యాపారంలా మారొద్దు. డబ్బు పంచే వారికి గుణపాఠం చెప్పాలి.

– సంగరబోయిన ఉమేష్, తూర్పుకోట

సేవ చేసే ప్రభుత్వాలనే ఎన్నుకోవాలి



ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం. ప్రతి ఒక్కరూ తప్పకుండా ఓటు హక్కు వినియోగించుకోవాలి. ప్రజలకు సేవలందించే ప్రభుత్వాన్ని ఎన్నుకోవాల్సిన బాధ్యత ఉంది. మంచి నాయకుడిని ఎన్నుకుంటాం.

– ఇనుగాల జోగిరెడ్డి, రిటైర్డ్ టీఎస్‌ఎస్పీ పోలీస్ అధికారుల సంక్షేమ సంఘం కార్యదర్శి

'కోడ్' ఉల్లంఘన

- వీరభద్రుడి సన్నిధిలోబీఆర్‌ఎస్ శ్రేణుల ప్రచారం
- అధికారులకు 'కాంగ్రెస్' ఫిర్యాదు చేసినట్లు సమాచారం

కురవి: ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా బీఆర్‌ఎస్ నాయకులు గురువారం మండల కేంద్రంలోని వీరభద్రస్వామి వారి ఆలయంలో కండువాలు మెడలో వేసుకుని పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో బీఆర్‌ఎస్ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన పథకాల బ్రోచర్‌లతో డోర్నకల్ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్‌ను గెలిపించాలని కోరుతూ ప్రచారం నిర్వహించారు. దీనిపై కాంగ్రెస్ నాయకులు ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది



ఆలయ సన్నిధిలో బ్రోచర్లతో ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

ఎన్నికల పరిశీలకుల నియామకం

సాక్షిప్రతినిధి, వరంగల్ : ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 12 నియోజకవర్గాలకు ఎన్నికల పరిశీలకులను నియమిస్తూ ఎన్నికల కమిషన్ ఉత్తర్వులు జారీ చేసింది. సాధారణ, శాంతిభద్రతలు, వ్యయ పరిశీలకులను కేటాయించింది. నామినేషన్ల స్వీకరణకు ఆయా నియోజకవర్గాల పరిధిలోని ఆర్డీఓ, ఇతర కార్యాలయాలను సిద్ధం చేశారు.

ఎన్నికల సంఘం నియమించిన ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల వివరాలు ఇవీ..

నియోజకవర్గం	సాధారణ పరిశీలకులు	శాంతిభద్రతల పరిశీలకులు
జనగామ	కె.రాజమణి	సుజిత్ కుమార్
స్టేషన్ ఘన్‌పూర్	రవీష్ గుప్త	సుజిత్ కుమార్
పాలకుర్తి	రవీష్ గుప్త	సుజిత్ కుమార్
డోర్నకల్	ప్రేమ్‌కుమార్ వీఆర్	ఆకాష్ తోమర్
మహబూబాబాద్	ప్రేమ్‌కుమార్ వీఆర్	ఆకాష్ తోమర్
నర్సంపేట	షణ్ముగరాజన్ ఎస్	రాజేశ్‌కుమార్
పరకాల	ఆనంద్ సింగ్	టోజో కార్గా
వరంగల్ పశ్చిమ	ఆనంద్ సింగ్	టోజో కార్గా
వరంగల్ తూర్పు	షణ్ముగరాజన్ ఎస్	రాజేశ్‌కుమార్
వర్ధన్నపేట	షణ్ముగరాజన్ ఎస్	రాజేష్‌కుమార్
భూపాలపల్లి	అమిత్‌కుమార్	అమిత్‌కుమార్
ములుగు	శశాంక్ మణి త్రిపాఠి	అంజన్ చక్రవర్తి
హుస్నాబాద్	జయశ్రీ ఎస్ భోజ్	సోనమ్ టెంజింగ్ బోటియా

జిల్లా	వ్యయ పరిశీకులు		
హనుమకొండ	రాహుల్ పంజాబ్‌రావుగవాండే		
వరంగల్	అమిత్‌ప్రతాప్‌సింగ్		
మహబూబాబాద్	బాబురాయ	ములుగు	సర్దార్ సింగ్
భూపాలపల్లి	శ్రీధర్‌కుమార్	జనగామ	జగన్నాథ్ ఝా

అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఆర్వోలు వివరాలు..

నియోజకవర్గం	రిటర్నింగ్ అధికారి
జనగామ	జనగామ ఆర్డీఓ
స్టేషన్ ఘన్‌పూర్	స్టేషన్ ఘన్‌పూర్ ఆర్డీఓ
పాలకుర్తి	జనగామ అడిషనల్ కలెక్టర్(రెవెన్యూ)
డోర్నకల్	తొర్రూరు ఆర్డీఓ(మరిపెడ)
మహబూబాబాద్	మహబూబాబాద్ ఆర్డీఓ
నర్సంపేట	నర్సంపేట ఆర్డీఓ
పరకాల	పరకాల ఆర్డీఓ
వరంగల్ పశ్చిమ	హనుమకొండ ఆర్డీఓ
వరంగల్ తూర్పు	జీడబ్ల్యూఎంసీ కమిషనర్
వర్ధన్నపేట	వరంగల్ అడిషనల్ కలెక్టర్(లోకల్‌బాడీస్)
భూపాలపల్లి	భూపాలపల్లి ఆర్డీఓ
ములుగు	ఏటూరునాగారం ఐటీడీఏ పీఓ

సాక్షి బిజినెస్
శుక్రవారం
3-11-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
490	144
64,081	19,133

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	13,260	▲ 199
డోజోన్స్	33,721	▲ 446
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,447	▲ 104
డాక్స్	15,144	▲ 220
షాంఘై	3,009	▲ 14
నికాయ్	31,950	▲ 348

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	61,092	▲ 80
బంగారం (99.5 స్వచ్ఛత)	60,847	▲ 79
వెండి (కిలో)	71,684	▲ 700

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	82.49	84.26
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	99.73	101.94
€	యూరో	ఒకటి	86.78	89.19
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	54.27	55.87
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	51.63	54.39
S$	సింగపూర్ డాలర్	ఒకటి	59.12	60.98
SAR	సౌదీ రియాల్	ధామస్‌కుక్	21.23	22.86
UAE D	యూఏఈ దిర్హామ్	ధామస్‌కుక్	21.87	23.49
¥	చైనా యువాన్	ధామస్‌కుక్	10.23	12.29

పోస్ట్ ద్వారా 2,000 నోట్ల మార్పిడి

బ్యాంక్ అకౌంట్లలో డబ్బు జమ



న్యూఢిల్లీ: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ప్రాంతీయ కార్యాలయాలకు దూరంగా ఉండే ప్రజలు తమ వద్ద ఉన్న రూ.2,000 నోట్లు మార్చుకోవడానికి సులభతరమైన విధానం అమలవుతోంది. పోస్ట్ ద్వారా ఈ మేరకు ప్రజలు సేవలు పొందవచ్చని ఇప్పటికే ప్రకటించిన ఆర్‌బీఐ ఉన్నతాధికారులు ఇందుకు వీలైన ప్రక్రియపై ప్రచారాన్ని చేపట్టారు. ఇన్సూర్డ్ పోస్ట్ లేదా టీఎల్ఆర్ (3 అంచెల రక్షణ) కవర్‌ను వినియోగించుకుని సురక్షితమైన మార్గంలో రూ.2,000 నోట్లు మార్చుకోవచ్చని అధికారులు వెల్లడించారు. ఈ విధానంలో పెద్ద నోట్ల మార్పిడికి సంబంధించిన డబ్బు సంబంధిత వినియోగదారు బ్యాంక్ ఖాతాల్లో జమవుతుంది. ''కస్టమర్‌లు రూ. 2,000 నోట్ల మార్పునకు సంబంధించిన డబ్బు తమ ఖాతాలో అత్యంత సురక్షితమైన పద్ధతిలో ప్రత్యక్షంగా క్రెడిట్ కావడానికి వీలుగా ఇన్సూర్డ్ పోస్ట్‌ను వినియోగించుకోవాలని ప్రోత్సహిస్తున్నాము. ఈ విధానం నిర్దేశిత ప్రాంతీయ కార్యాలయాలకు ప్రయాణించడం, వరుసలో నిలబడ్డం వంటి ఇబ్బందుల నుంచి వినియోగదారుని నివారిస్తుంది'' అని ఆర్‌బీఐ రీజినల్ డైరెక్టర్ రోహిత్ పి. దాస్ అన్నారు. చెలామణిలో ఉన్న రూ.2,000 నోట్లలో 97 శాతానికి పైగా తిరిగి బ్యాంకింగ్ వ్యవస్థకు చేరాయని ఆర్‌బీఐ తెలిపింది. అక్టోబర్ 30వ తేదీ నాటికి రూ.10,000 కోట్ల విలువైన నోట్లు మాత్రమే ప్రజల వద్ద ఉన్నాయని పేర్కొంది. ఈ ఏడాది మే 19న ఆర్‌బీఐ రూ.2,000 డినామినేషన్ నోట్లను చెలామణి నుంచి ఉపసంహరించుకుంటున్నట్లు ప్రకటించింది. దేశంలోని 19 ఆర్‌బీఐ కార్యాలయాల్లో ప్రజలు రూ. 2,000 నోట్లను డిపాజిట్ చేయవచ్చు లేదా మార్చుకోవచ్చు. రూ.2 వేల నోట్ల డిపాజిట్ లేదా మార్పిడి సేవలను బ్యాంకు శాఖలు అక్టోబర్ 7 వరకు అందించాయి. అక్టోబర్ 8 నుంచి ఈ సేవలు 19 ఆర్‌బీఐ కార్యాలయాలకు మారాయి.

కోటక్ ఇన్సూరెన్స్‌లో 'జ్యూరిక్'కు వాటాలు

51% కొనుగోలు; డీల్ విలువ రూ. 4,051 కోట్లు



ముంబై: సాధారణ బీమా సంస్థ కోటక్ జనరల్ ఇన్సూరెన్స్‌లో (కేజీఐ) స్విట్జర్లాండ్‌కు చెందిన జ్యూరిక్ ఇన్సూరెన్స్ 51 శాతం వాటాలు దక్కించుకోనుంది. ఇందుకోసం రూ. 4,051 కోట్లు వెచ్చించనుంది. తదుపరి అదనంగా మూడేళ్లలో అదనంగా 19 శాతం వాటాలు కూడా జ్యూరిక్ ఇన్సూరెన్స్ కొనుగోలు చేయనున్నట్లు కేజీఐ మాతృ సంస్థ కోటక్ మహీంద్రా బ్యాంక్ వెల్లడించింది. వృద్ధి అవకాశాలు పటిష్టంగా ఉన్న కీలక మార్కెట్లలో భారత్ కూడా ఒకటని, కేజీఐ తమకు పటిష్టమైన భాగస్వామి కాగలదని జ్యూరిక్ సీఈవో (ఆసియా పసిఫిక్) తులసి నాయుడు తెలిపారు. తమ కస్టమర్లకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు ఇరు సంస్థల వనరులు, అనుభవం తోడ్పడగలవని కోటక్ జనరల్ ఇన్సూరెన్స్ ఎండీ దీపక్ గుప్తా పేర్కొన్నారు. ప్రీమియంపరంగా నాన్-లైఫ్ మార్కెట్‌లో సెప్టెంబర్‌లో కేజీఐకి 0.52 శాతం వాటా నమోదైంది. గత ఆర్థిక సంవత్సరం రూ. 1,148 కోట్ల మేర స్థూల ప్రీమియం సాధించింది. కొత్త పెట్టుబడుల అనంతరం సంస్థ విలువ రూ. 7,943 కోట్లుగా ఉండనుంది.


ఫ్యాషన్ స్టార్టప్స్‌లో అజియో పెట్టుబడులు



న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా 100 డైరెక్ట్ టు కస్టమర్ ఫ్యాషన్ స్టార్టప్స్‌లో పెట్టుబడి పెట్టాలని లైఫ్‌స్టైల్, ఫ్యాషన్ ఈ-కామర్స్ కంపెనీ అజియో భావిస్తోంది. ఈ స్టార్టప్స్ తయారు చేసే, విక్రయించే దుస్తులు, పాదరక్షలు, యాక్సెసరీస్ వంటి ఉత్పత్తులను డైరెక్ట్ టు కన్స్యూమర్ వేదిక అయిన అజియోగ్రామ్‌లో అందుబాటులో ఉంచనుంది. భారతీయ ఫ్యాషన్, లైఫ్‌స్టైల్ విభాగంలోని 200 బ్రాండ్స్‌ను ఎక్స్‌క్లూజివ్‌గా అజియోగ్రామ్‌లో వచ్చే ఏడాదికల్లా చేర్చనున్నట్టు వెల్లడించింది. ఈ బ్రాండ్స్ విస్తరణకు, ఆదాయ వృద్ధికి పూర్తి సహకారం అందించనున్నట్టు అజియో ప్రకటించింది.

దాతృత్వంలో శివ్ నాడార్ టాప్

- రూ. 2,042 కోట్ల విరాళం
- ఎడెల్‌గివ్ హురున్ ఇండియా లిస్టులో అగ్రస్థానం



ముంబై: విరాళాలివ్వడంలో ఐటీ దిగ్గజం హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ చీఫ్ శివ్ నాడార్ మరోసారి తన ఉదారత చాటుకున్నారు. 2023లో ఏకంగా రూ. 2,042 కోట్లు విరాళమిచ్చి ఎడెల్‌గివ్ హురున్ ఇండియా 2023 జాబితాలో అగ్రస్థానంలో నిల్చారు. గతేడాది ఇచ్చిన రూ. 1,161 కోట్లతో పోలిస్తే ఇది 76 శాతం అధికం. విప్రో అధినేత అజీమ్ ప్రేమ్‌జీ రూ. 1,774 కోట్లతో (గతేడాదితో పోలిస్తే 267 శాతం అధికం) రెండో స్థానంలోనూ, రూ. 376 కోట్లతో రిలయన్స్ ఇండస్ట్రీస్ సీఎండీ ముకేశ్ అంబానీ మూడో స్థానంలో ఉన్నారు. అంబానీ విరాళాలు గతేడాదితో పోలిస్తే 8 శాతం తగ్గాయి. ఆదిత్య బిర్లా గ్రూప్ చీఫ్ కుమార మంగళం బిర్లా రూ. 287 కోట్లతో నాలుగో స్థానంలో, అదానీ గ్రూప్ అధినేత గౌతమ్ అదానీ రూ. 285 కోట్లతో (50 శాతం అధికం) ఈ జాబితాలో అయిదో స్థానంలో ఉన్నారు. ఇటీవలి హురున్ కుబేరుల జాబితా ప్రకారం అంబానీ సంపద రూ. 8.08 లక్షల కోట్లుగాను, అదానీది రూ. 4.74 లక్షల కోట్లు, నాడార్ సంపద రూ. 2.28 లక్షల కోట్లుగాను ఉంది. సంపద పెరిగే కొద్దీ సంపన్న కుటుంబాలు .. అట్టడుగు వర్గాల వారి కోసం ఆహారం, దుస్తులు, ఉపకార వేతనాలు మొదలైన దాతృత్వ కార్యకలాపాలకు విరాళాలిచ్చే ధోరణి పెరుగుతోందని హురున్ ఇండియా చీఫ్ రీసెర్చర్ అనాస్ రెహ్మాన్ జునైద్ తెలిపారు. లిస్టులో మొత్తం 119 మంది వ్యక్తులు, కుటుంబాలు ఉన్నాయి.

మరిన్ని వివరాలు..

- బజాజ్ కుటుంబంతో పాటు సైరస్ ఎస్ పూనావాలా, అదార్ పూనావాలా, రోహిణి నీలేకని వంటి వారు టాప్ 10లో నిల్చారు. మహిళల్లో నీలేకనితో పాటు అను ఆగా (థర్మాక్స్), లీనా గాంధీ తివారీ (యూఎస్‌వీ) కూడా ఉన్నారు.
- డిస్కౌంటు బ్రోకరేజీ జిరోధా సహ-వ్యవస్థాపకుడు నిఖిల్ కామత్ ఈ జాబితాలో అత్యంత పిన్న వయస్కుడు. కామత్ సోదరులు రూ. 110 కోట్లు విరాళమిచ్చారు.
- రూ. 150 కోట్ల విరాళంతో ఎల్‌అండ్‌టీ గౌరవ చైర్మన్ ఏఎం నాయక్ .. ప్రొఫెషనల్స్ జాబితాలో అగ్రస్థానంలో, ఓవరాల్ లిస్టులో 11వ స్థానంలో ఉన్నారు.

గెయిల్‌కు బీపీసీఎల్ ముడిసరుకు సరఫరా

రూ. 63,000 కోట్ల ఒప్పందం

న్యూఢిల్లీ: మహారాష్ట్రలో నెలకొల్పుతున్న పెట్రోకెమికల్ ప్లాంటుకు అవసరమైన ముడిసరుకు కోసం భారత్ పెట్రోలియం కార్పొరేషన్ (బీపీసీఎల్)తో గెయిల్ (ఇండియా) ఒప్పందం కుదుర్చుకుంది. ఈ డీల్ విలువ రూ. 63,000 కోట్లు. దీని ప్రకారం 15 ఏళ్ల పాటు గెయిల్‌కు చెందిన ఉసార్ ప్లాంటుకు బీపీసీఎల్ తమ ఎల్‌పీజీ దిగుమతి కేంద్రం నుంచి ఏటా 6 లక్షల టన్నుల ప్రొపేన్ గ్యాస్‌ను సరఫరా చేయనుంది. ఉసార్‌లో 5,00,000 టన్నుల సామర్థ్యంతో గెయిల్ దేశీయంగా తొలి ప్రొపేన్ డీహైడ్రోజినేషన్ (పీడీహెచ్) ప్లాంటును నిర్మిస్తోంది. ఈ ప్లాంటు 2025 నాటికి అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. ఫర్నిచర్ ఉపకరణాలు, బొమ్మలు మొదలైన వాటిలో ఉపయోగించే పాలీప్రొపిలీన్ తయారీ ప్లాంటుకు ఇది అనుసంధానమై ఉంటుంది.

మార్కెట్‌కు 'ఫెడ్' బూస్ట్!

- ఫెడరల్ రిజర్వ్, బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్ వడ్డీ రేట్లు యథాతథం
- కలిసొచ్చిన ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలో జోష్
- 490 పాయింట్లు పెరిగి 64 వేల స్థాయి పైకి సెన్సెక్స్
- 144 పాయింట్ల లాభంతో 19,100 పైకి నిఫ్టీ

ముంబై: అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను ఊహించినట్లే యథాతథంగా ఉంచడంతో పాటు సరళతర ద్రవ్య విధాన అమలు వ్యాఖ్యలు ఈక్విటీ మార్కెట్లలో సానుకూలతలు నింపాయి. దేశీయంగా వాహన విక్రయాలు రికార్డు గరిష్టానికి చేరుకోవడం, జీఎస్టీ వసూళ్లు పెరగడం, కార్పొరేట్ క్యూ2 ఆర్థిక ఫలితాలు మెప్పించడం కలిసొచ్చాయి. ఫలితంగా గురువారం సెన్సెక్స్ 490 పాయింట్లు పెరిగి 64,081 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 144 పాయింట్లు బలపడి 19,133 వద్ద నిలిచింది. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు అందుకున్న సూచీలు ఉదయం భారీ లాభాల్లో మొదలయ్యాయి. ట్రేడింగ్ ప్రారంభం నుంచి అన్ని రంగాల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో సూచీలు ఆద్యంతం జోరు కనబరిచాయి. ఒక దశలో సెన్సెక్స్ 611 పాయింట్లు దూసుకెళ్లి 64,203 వద్ద, నిఫ్టీ 186 పాయింట్లు బలపడి 19,175 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకాయి. రియల్టీ, ప్రభుత్వరంగ బ్యాంకులు, మెటల్, ఎఫ్ఎంసీజీ, ఫార్మా షేర్లకు చిన్న, మధ్య తరహా షేర్లు భారీ డిమాండ్ లభించింది. దీంతో బీఎస్ఈ మిడ్, స్మాల్ సూచీలు ఒకశాతానికి పైగా ర్యాలీ చేశాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.1,261 కోట్ల షేర్లను అమ్మేయగా, సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.1380 కోట్ల షేర్లు కొన్నారు. ఫెడ్ రిజర్వ్ నుంచి సానుకూల సంకేతాలు, జపాన్ ప్రభుత్వం 113 బిలియన్ డాలర్ల ఉద్దీపన ప్యాకేజీకి ప్రకటన, బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్ సైతం వడ్డీరేట్ల జోలికెళ్లకపోవడం తదితర పరిణామాలతో ఆసియా, యూరప్ మార్కెట్లు 1-2% ర్యాలీ చేశాయి. అమెరికా స్టాక్ మార్కెట్లు 1-1.5 శాతం లాభాల్లో ట్రేడవుతున్నాయి.



- సెన్సెక్స్ ర్యాలీతో బీఎస్ఈలో ఇన్వెస్టర్లు సంపదగా భావించే కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.3.1 లక్షల కోట్లు పెరిగి రూ. 313.32 లక్షల కోట్లకు చేరింది. సెన్సెక్స్ 30 షేర్లలో టెక్ మహీంద్రా(1%), బజాజ్ ఫైనాన్స్(0.25%) మాత్రమే నష్టపోయాయి.
- క్యూ2 నికర లాభం ఐదు రెట్లు వృద్ధి సాధించడంతో జేకే టైర్ షేరు 10% లాభపడి రూ.337 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో 14% ర్యాలీ చేసి రూ.351 వద్ద ఏడాది గరిష్టాన్ని తాకింది.
- క్యూ2 ఫలితాల ప్రకటన తర్వాత హీరో మోటో కార్ప్ షేరులో లాభాల స్వీకరణ జరిగింది. 1% నష్టపోయి రూ.3050 వద్ద స్థిరపడింది.

లాభాల్లోకి టాటా మోటార్స్

- క్యూ2లో రూ. 3,783 కోట్లు
- జేఎల్ఆర్ అమ్మకాలు జూమ్



న్యూఢిల్లీ: ఆటో రంగ దిగ్గజం టాటా మోటార్స్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023-24) రెండో త్రైమాసికంలో నష్టాలను వీడి లాభాల్లోకి ప్రవేశించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జులై-సెప్టెంబర్(క్యూ2)లో రూ. 3,783 కోట్ల నికర లాభం ఆర్జించింది. గతేడాది (2022-23) ఇదే కాలంలో రూ. 1,004 కోట్ల నికర నష్టం ప్రకటించింది. బ్రిటిష్ లగ్జరీ కార్ల అనుబంధ సంస్థ జాగ్వార్ ల్యాండ్ రోవర్(జేఎల్ఆర్) పనితీరు లాభాలకు దోహదపడింది. వెరసి వరుసగా నాలుగో త్రైమాసికంలోనూ లాభాలను ప్రకటించగలిగింది. ఆదాయం రూ. 79,611 కోట్ల నుంచి రూ. 1,05,128 కోట్లకు దూసుకెళ్లింది. ఇక స్టాండెలోన్ ప్రాతిపదికన సైతం రూ. 1,270 కోట్ల నికర లాభం సాధించగా.. గతేడాది క్యూ2లో రూ. 293 కోట్ల నికర నష్టం నమోదైంది.

ఇకపై మరింత దూకుడు: తాజా సమీక్షా కాలంలో జేఎల్ఆర్ ఆదాయం 30 శాతం జంప్ చేసి 6.9 బిలియన్ పౌండ్లకు చేరింది. హోల్‌సేల్ అమ్మకాలు, కొత్త ప్రొడక్టులు, వ్యయ నియంత్రణలు, డిమాండుకు అనుగుణమైన పెట్టుబడులు ఇందుకు సహకరించాయి. కాగా.. ఈ ఏడాది ద్వితీయార్ధం(అక్టోబర్-మార్చి)లో హోల్‌సేల్ అమ్మకాలు క్రమంగా జోరందుకోనున్నట్లు కంపెనీ అంచనా వేస్తోంది. నిర్వహణ(ఇబిట్) మార్జిన్లు గత 6 శాతం అంచనాలకంటే అధికంగా 8 శాతాన్ని తాకవచ్చని భావిస్తోంది. ఈ ఏడాది 2 బిలియన్ పౌండ్ల ఫ్రీ క్యాష్‌ఫ్లోను సాధించగలదని ఆశిస్తోంది. వెరసి మార్చికల్లా నికర రుణ భారం బిలియన్ పౌండ్లకంటే దిగువకు చేరవచ్చని అభిప్రాయపడింది.

ఫలితాల నేపథ్యంలో టాటా మోటార్స్ షేరు 1.5% బలపడి రూ. 637 వద్ద ముగిసింది.

నాగరాజుకు ఎలా ఓటు వేయాలి?



మాట్లాడుతున్న మాజీ మావోయిస్టు నేత కేతపాక ఏలేష్

హసన్‌పర్తి : రిటైర్డ్ పోలీసు అధికారి కేఆర్ నాగరాజుకు ఎలా ఓటు వేయాలని మాజీ మావోయిస్టులు ప్రశ్నించారు. ఈ మేరకు గురువారం చింతగట్టు క్యాంప్‌లోని కేఎల్ఎన్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఎన్‌కౌంటర్ స్పెషలిస్టని కేఆర్ నాగరాజును వర్ధన్నపేట అభ్యర్థిగా ఖరారు చేశారా అని ప్రశ్నించారు. సూదన్‌పల్లి గ్రామానికి చెందిన భీమన్న లొంగిపోవడానికి సిద్ధంగా ఉంటే ఎన్‌కౌంటర్ పేరుతో స్పెషల్ పార్టీలో పనిచేస్తున్న నాగరాజు కాల్చిచంపాడని పేర్కొన్నారు. అన్నాసాగరంలో కూడా అశోక్‌పై తూటాల వర్షం కురిపించి.. డంప్‌ను ఎత్తుకెళ్లారని ఆరోపించారు. స్పెషల్ పార్టీ సీఐగా పనిచేసిన కాలంలో అన్నాసాగరం, నాగారం, మల్లారెడ్డిపల్లి, జయగిరి, సూదన్‌పల్లి తరాలపల్లి, దేవన్నపేట, పైడిపల్లి గ్రామాల్లో మావోయిస్టు సానుభూతిపరులతో పాటు అజ్ఞాత మావోయిస్టు కుటుంబాలను నాగరాజు ఇబ్బందులకు గురి చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం నాగరాజు చేతిలో ఎన్‌కౌంటర్‌కు గురైన కుటుంబాలు దుర్భర జీవితం అనుభవిస్తున్నాయని పేర్కొన్నారు. అప్పుడు ఎన్‌కౌంటర్ చేసిన నాగరాజు ఇప్పుడు ఎమ్మెల్యేగా గెలిస్తే ప్రజలను దోచుకుంటాడని వారు ఆరోపించారు.

అభ్యర్థిత్వంపై పునరాలోచించాలి

కాంగ్రెస్ వర్ధన్నపేట నియోజకవర్గ అభ్యర్థి నాగరాజు అభ్యర్థిత్వంపై పునరాలోచించాలని మాజీ మావోయిస్టులు కోరారు. లేని పక్షంలో బీఆర్ఎస్ అభ్యర్థి అరూరి రమేష్‌ను బలపరుస్తామని ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. ఈ సమావేశంలో మాజీ మావోయిస్టులు కేతపాక ఏలేశ్, చుంచు సదానందం, మేకల రాజయ్య, తప్పట్ల దేవేందర్, రాజమౌళి, సదానందం తదితరులు పాల్గొన్నారు.

పాము కాటుతో మహిళ మృతి

కాజీపేట: పాము కాటుతో ఓ మహిళ మృతి చెందింది. ఈ ఘటన కాజీపేట 63వ డివిజన్ తిలక్‌నగర్ కాలనీకిలో జరిగింది. కాలనీకి చెందిన బోసు సత్య (38) ఇళ్లలో పని చేసుకుంటూ జీవనం కుటుంబాన్ని పోషించుకుంటోంది. ఈ క్రమంలో బుధవారం మధ్యాహ్నం పనులకు వెళ్లి వచ్చి గుడిసెలో నిద్రిస్తుండగా పాము కాటేసింది. పామును గుర్తించిన సత్య.. కాలనీవాసులకు చెప్పగా వారు చికిత్స నిమిత్తం ఎంజీఎం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సత్య గురువారం మృతి చెందింది. ఈ ఘటనపై మృతురాలి సోదరుడు ఎత్తరి ఎల్లస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాజు తెలిపారు.

ఒకటికి.. రెండింతలు

పోలీసులకు చిక్కిన నకిలీ కరెన్సీ ముఠా

- ఫేక్ కరెన్సీ స్వాధీనం
- నలుగురు అరెస్టు, ముగ్గురు పరారీ



ఫేక్ కరెన్సీ ముఠా అరెస్టు చూపిస్తున్న పోలీసులు

హసన్‌పర్తి : ఒరిజినల్ కరెన్సీ రూ. లక్ష ఇస్తే.. ఫేక్ కరెన్సీ రెండు లక్షలు. ఇలా ఫేక్ కరెన్సీ బదలాయింపునకు వచ్చిన ఓ ముఠా కేయూ పోలీసులకు చిక్కింది. ఈ ఘటనలో ఫేక్ కరెన్సీతో పాటు కొంత ఒరిజినల్ కరెన్సీని స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను సీఐ అబ్బయ్య వెల్లడించారు. ములుగు గణపురానికి చెందిన పోరిక రాజ్‌కుమార్, బూర శ్రీకాంత్, రాజేష్, మంతెన కావ్య ముఠాగా ఏర్పడి నకిలీ కరెన్సీని మార్కెట్‌లో చలామణి చేస్తున్నారు. నకిలీ కరెన్సీ వ్యాపారంలో రాజ్‌కుమార్ పలుమార్లు జైలుకెళ్లినా అతడి ప్రవర్తనలో మార్పు రాలేదు.

నాదేండ్‌లో బ్రోకర్ పరిచయం

జైలు శిక్షలో భాగంగా నాదేండ్‌లో పఠాన్ అలియాస్ హుస్సేన్‌తో రాజ్‌కుమార్‌కు పరిచయం ఏర్పడింది. ఈక్రమంలో వారి మధ్య ఫేక్ కరెన్సీ చలామణి అంశం చర్చకు వచ్చింది. రెండితలు ఫేక్ కరెన్సీ ఇస్తే.. అందుకు ఒకవంతు ఒరిజినల్ కరెన్సీ ఇస్తానని పఠాన్‌తో రాజ్‌కుమార్ చెప్పాడు. అందుకు కమిషన్ కూడా ఇస్తాన్నారు.

నగర శివారులో అందజేస్తాం..

నగర శివారులోకి వస్తే తాము తీసుకొచ్చిన రూ. నాలుగు లక్షల ఫేక్ కరెన్సీని అందిస్తామని ముఠా సభ్యులు సూచించారు. అక్కడి నుంచి రాజ్‌కుమార్‌తో పాటు ఓంకార్ విశ్వనాథ్‌రావు బూరే, విష్ణుకవాల్ చింతగట్టు క్యాంప్ సమీపంలోని ఓఆర్ఆర్ వద్దకు చేరుకున్నారు. అప్పటికే అక్కడ తనిఖీలు నిర్వహిస్తున్న టాస్క్‌ఫోర్స్‌తో పాటు స్థానిక పోలీసులకు ఆ ముఠా చిక్కింది. దీంతో విచారించగా వాస్తవాలు వెల్లడించారు. వారి వద్ద నుంచి రూ.4 లక్షల విలువైన నకిలీ కరెన్సీ, రూ.85వేల ఒరిజినల్ కరెన్సీ లభ్యమైంది. నిందితులు పోరిక రాజ్‌కుమార్, ఓంకార్ విశ్వనాథ్‌రావు బూరే, విష్ణుకవాల్‌తోపాటు డ్రైవర్ దొండ్డి సంబాజిని అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు. రాజేష్, బూర శ్రీకాత్, మంతెన కావ్య పరారీలో ఉన్నట్లు చెప్పారు.

నకిలీ కరెన్సీతో హనుమకొండకు..


ఈ క్రమంలో నకిలీ కరెన్సీ వ్యాపారం చేస్తున్న ఓంకార్ విశ్వనాథ్‌రావు బూరే, విష్ణుకవాల్‌కు పఠాన్ ఈ విషయం చెప్పాడు. హనుమకొండకు వెళ్లి రాజ్‌కుమార్‌కు రెండితలు ఫేక్ కరెన్సీ ఇస్తే ..ఒకవంతు ఒరిజినల్ కరెన్సీ ఇస్తాడని వివరించాడు. దీంతో వారు రాజ్‌కుమార్‌ను సంప్రదించి నాదెండ్ నుంచి హనుమకొండకు పయనమయ్యారు. ఫోన్‌లో రాజ్‌కుమార్‌ను సంప్రదించగా హనుమకొండలోని సతీష్ లాడ్జీ అడ్రస్ ఇచ్చాడు. రూ.4 లక్షల నకిలీ కరెన్సీ తీసుకొచ్చామని చూపించారు. ఇందుకు రాజ్‌కుమార్ వారికి రెండు రూ. లక్షల ఒరిజినల్ కరెన్సీ అందజేశారు. అనంతరం వారు తీసుకున్న డబ్బు నుంచి బ్రోకర్ పఠాన్‌కు రూ. లక్ష ఆన్‌లైన్ చేశారు. బూర శ్రీకాంత్‌కు రూ. పది వేలు, మంతెన కావ్యకు, ఐదు వేలు ఇచ్చారు.

ఒడిశా టు వరంగల్..

- శుద్ధి చేసిన గంజాయి తరలిస్తూ ఇద్దరి అరెస్టు
- రూ.3 లక్షల విలువైన సరుకు స్వాధీనం

ఖిలా వరంగల్: శుద్ధి చేసిన గంజాయిని ఒడిశా నుంచి వరంగల్‌కు తరలిస్తూ ఇద్దరు పట్టుపడ్డారు. వారి వద్ద నుంచి రూ.3 లక్షల విలువైన 12 కేజీల సరుకును స్వాధీనం చేసుకుని నింధితులను రిమాండ్ తరలించినట్లు మండల ఎక్సైజ్ సీఐ చంద్రమోహన్ తెలిపారు. పుప్పాలగుట్టలోని మండల ఎక్సైజ్ స్టేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఒడిశాలో శుద్ధి చేసిన గంజాయి కొనుగోలు చేసి రైలులో వరంగల్ తరలిస్తున్నట్లు గురువారం ఉదయం సమాచారం అందింది. దీంతో వరంగల్ రైల్వేస్టేషన్, శివనగర్ పరిసరాల్లో ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో ఒడిశాలోని సిరంపూర్ గ్రామంలో కొనుగోలు చేసి వరంగల్‌కు.. ఇక్కడి నుంచి మహారాష్ట్రకు తరలిస్తున్న మహారాష్ట్రలోని బీడ్ జిల్లా బహిర్ వాడి రామ్ తీర్థ్ గ్రామానికి చెందిన సవిత, జానకీ రామ్ పట్టుపడ్డారు. దీంతో వారి వద్ద నుంచి 12 కేజీల సరుకు స్వాధీనం చేసుకుని రిమాండ్ తరలించినట్లు సీఐ చంద్రమోహన్ తెలిపారు. తనిఖీల్లో ఎక్సైజ్ ఎస్సైలు రజిత, ఏ. సరిత, రేష్మ సుల్తానా, రాజు, రాజయ్య, చిరంజీవి, తిరుపతి, అహ్మద్‌పాషా, సిబ్బంది పాల్గొన్నారు.

మనస్తాపంతో విద్యార్థి బలవన్మరణం




అజయ్ (ఫైల్)

వర్ధన్నపేట: చదువు నిమిత్తం తండ్రిని డబ్బులు ఇవ్వాలని కోరగా, పరిస్థితులు బాగా లేవని తర్వాత ఇస్తానని చెప్పడంతో ఆ విద్యార్థి మనస్తాపం చెంది క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలంలోని నల్లబెల్లి గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. వర్ధన్నపేట ఎస్సై ప్రవీణ్‌కుమార్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన చాగంటి కుమారస్వామి కుమారుడు అజయ్ (20) బీఎస్సీ సెకండియర్ చదువుతున్నాడు. ఇటీవల అతనికి బైక్ కొనిచ్చాడు. కాగా, పుస్తకాలు, ఇతరత్రా వాటికి డబ్బులు కావాలని తండ్రిని అడగగా, మొన్ననే బైక్ కొనిచ్చాను.. ఇప్పుడు పరిస్థితులు బాగా లేవని తర్వాత ఇస్తానని చెప్పాడు. దీంతో మనస్తాపానికి గురైన అజయ్ బుధవారం సాయంత్రం ఇంట్లోనుంచి బయటకు వెళ్లాడు. రాత్రి 9 గంటలు అయినా ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు ఫోన్ చేయగా స్విచాఫ్ అని వచ్చింది. దీంతో వారు గ్రామానికి చెందిన ఇస్తారితో కలిసి వెతుకుతున్న క్రమంలో వ్యవసాయ బావి వద్దకు వెళ్లి చూడగా అక్కడ ద్విచక్రవాహనం కనిపించింది. సమీపంలో అపస్మారకస్థితిలో పడి ఉన్న కుమారుడిని చూసి లబోదిబో మన్నారు. పక్కనే క్రిమి సంహారకమందు డబ్బా ఉండడంతోపాటు పరిసరాలన్నీ వాసన రావడంతో మందు తాగి చనిపోయినట్లు గుర్తించారు. కుమారస్వామి స్థానిక పీఎస్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

తప్పిన పెను ప్రమాదం..

- రోడ్డు పక్కన కాలువలోకి దూసుకెళ్లిన ప్రైవేట్ స్కూల్ బస్సు
- విద్యార్థులు సురక్షితం
- ఊపిరి పీల్చుకున్న తల్లిదండ్రులు



ప్రమాదానికి గురైన స్కూల్ బస్సు

శాయంపేట : త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. విద్యార్థులతో వెళ్తున్న ఓ ప్రైవేట్ స్కూల్ బస్సు స్టీరింగ్ లాక్ కావడంతో రోడ్డు పక్కన ఉన్న కాలువలోని దూసుకెళ్లింది. అయితే బస్సు కాలువ ఒడ్డుకు ఆగడంతో పలువురు విద్యార్థులు ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. ఈ ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని ప్రగతిసింగారం గ్రామంలోని సన్‌రైజ్ ప్రైవేట్ స్కూల్ బస్సు గురువారం మొదటి ట్రిప్పులో సాధనపల్లి, నిజాంపల్లి విద్యార్థులను తీసుకుస్తోంది. ఈ క్రమంలో సూర్యనాయక్ తండా గ్రామ శివారులో స్టీరింగ్ లాక్ కావడంతో రోడ్డు పక్కన ఉన్న కాలువలోకి దూసుకెళ్లింది. వెంటనే డ్రైవర్ వేమునూరి రాజు చాకచక్యంతో బస్సు నిలిపివేశాడు. ఈ సమయంలో పిల్లలు కేకలు వేయడంతో పక్కనే ఉన్న గ్రామస్తులు హుటాహుటిన ఘటనా స్థలికి చేరుకుని విద్యార్థులను దింపారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు. డ్రైవర్ బస్సును నియంత్రించకపోతే మరో మీటర్ దూరంలో ఉన్న వ్యవసాయ బావిలో పడేదని తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. ఈ ఘటనపై పాఠశాల యాజమాన్యం ఘటనా స్థలికి రాకపోవడం గమనార్హం.

డిప్లొమా ఇంజనీర్లు ఐక్యత చాటాలి



తెలంగాణ పవర్ డిప్లొమా ఇంజనీర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

- అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీసీ రెడ్డి

హన్మకొండ: విద్యుత్ డిప్లొమా ఇంజనీర్లు ఐక్యత చాటాలని తెలంగాణ పవర్ డిప్లొమా ఇంజనీర్స్ అసోషియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.బీసీ రెడ్డి అన్నారు. గురువారం హనుమకొండ విద్యుత్‌నగర్‌లోని తెలంగాణ పవర్ డిప్లొమా ఇంజనీర్స్ అసోసియేషన్ కార్యాలయంలో రాష్ట్ర సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిప్లొమా ఇంజనీర్ల సమస్యల పరిష్కారానికి, హక్కుల సాధనకు పోరాడే ఏకైక అసోసియేషన్ తమదేనన్నారు. అనంతరం అసోసియేషన్ రాష్ట్ర కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.మధుసూదన్, చీఫ్ అడ్వయిజర్ ఆర్.ఆర్.గోవర్ధన్ రెడ్డి, టీఎస్ ఎన్పీడీసీఎల్ శాఖ ప్రధాన కార్యదర్శి నార్ల సుబ్రమణ్యేశ్వర్‌రావు, నాయకులు పి.మల్లికార్జున్, తాజుద్దీన్, మనోరంజన్ రెడ్డి, పి.శ్రీనివాస్‌లు, వి.సుధాకర్ రెడ్డి, ఎన్.నర్సింహులు, టి.చంద్రశేఖర్, టి.నరేష్ కుమార్, జె.చంద్రశేఖర్, ఎల్.శ్రీనివాస్‌లు, టి.రాజశేఖర్, ఎ.ఇంద్రసేనా రెడ్డి, ఎస్.మాధవ రెడ్డి, రాజ సురేంద్రచారి, కె.శ్రీనివాస్ రెడ్డి, సీహెచ్.శ్రీనివాసులు, ఎస్.రమేష్ పాల్గొన్నారు.

తాగడం, తూలడమే ప్రభుత్వ పాలసీ

- బీఆర్ఎస్, బీజేపీ వైఫల్యాలను ఎండగట్టాలి
- ఏఐసీసీ కార్యదర్శి క్రిస్టోఫర్ తిలక్



మాట్లాడుతున్న ఏఐసీసీ కార్యదర్శి క్రిస్టోఫర్ తిలక్

కమలాపూర్ : ప్రజలకిచ్చిన హామీలన్నింటినీ తుంగలో తొక్కి దేశంలోనే నంబర్ వన్ అని చెప్పుకుంటున్న తెలంగాణలోని కేసీఆర్ ప్రభుత్వ పాలసీ.. తాగడం, తూలడమే అని ఏఐసీసీ కార్యదర్శి, కరీంనగర్ పార్లమెంట్ పరిశీలకుడు క్రిస్టోఫర్ తిలక్ విమర్శించారు. కమలాపూర్‌లో గురువారం జరిగిన మండల స్థాయి బూత్ కమిటీలు, కార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎన్నికలకు సంబంధించి దిశా నిర్దేశం చేశారు. కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం ప్రతి ఒక్కరూ కష్టపడి పని చేయాలన్నారు. హుజూరాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ పరిశీలకుడు, ఎన్ఎస్‌యూఐ ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు నాగం మధు యదవ్ మాట్లాడుతూ.. హుజూరాబాద్‌లో ఈటల శకం ముగిసి కాంగ్రెస్ శకం ప్రారంభం కాబోతోందన్నారు. కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ అభ్యర్థి వొడితల ప్రణవ్.. మాట్లాడుతూ బీఆర్ఎస్, బీజేపీలపై ఉన్న వ్యతిరేకతతో యువత పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని, హుజూరాబాద్ గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చరణ్‌పటేల్, మహిళా అధ్యక్షురాలు సునీత, నాయకులు పత్తి కృష్ణారెడ్డి, తౌటం రవీందర్, దేశిని అయిలయ్య, బాలసాని రమేశ్, పోడేటి భిక్షపతి, వంశీధర్‌రావు, ప్రసాద్, కృష్ణమూర్తి, మనీశ్‌గౌడ్, మస్న చంద్రశేఖర్, శివగౌడ్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, బూత్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అవినీతి సర్కార్‌కు ఓటుతో బుద్ధి చెప్పాలి

- ఏఐసీసీ అధికార ప్రతినిధి దోల్వి శర్మ



మాట్లాడుతున్న ఏఐసీసీ అధికార ప్రతినిధి దోల్వి శర్మ

పరకాల: అవినీతి పాలన సాగిస్తున్న కేసీఆర్ సర్కార్‌కు ఓటుతో పోటు వేయాల్సిన అవసరం ఉందని ఏఐసీసీ అధికార ప్రతినిధి దోల్వి శర్మ అన్నారు. పరకాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రాజెక్టుల పేరిట రూ.లక్ష కోట్ల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని, రాష్ట్రంలో శాంతి భద్రతలు లేకుండా పోయాయన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే.. ఆరు గ్యారంటీలతో పాటు 2 లక్షల ఉద్యోగాలు తక్షణమే అమలు చేస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీని ఆదరించాలని కోరారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు కొయ్యడ శ్రీనివాస్, కౌన్సిలర్ పంచగిరి జయమ్మ, నాయకులు కొలుగూరి రాజేశ్వర్‌రావు, ఎం.డీ రంజన్ అలీ, కొక్కిరాల తిరుపతిరావు, మంద రాంచందర్ పాల్గొన్నారు.

V
సాక్షి ఫ్యామిలీ
వరంగల్
శుక్రవారం ॥ 3-11-2023

● టెక్.. టాక్

హువావే నోవా 11 ఎస్ఈ



సైజ్: 6.67 అంగుళాలు; రిజల్యూషన్: 1080×2400 పిక్సెల్స్
బరువు: 186 గ్రా. బ్యాటరీ: 4500 ఎంఏహెచ్
కలర్స్: గ్రీన్, వైట్, బ్లాక్ ● 5జీ కనెక్టివిటీ రిఫ్రెష్ రేట్: 90 హెచ్‌జడ్

లెనోవా ట్యాబ్ పీ12



సైజ్: 12.7 అంగుళాలు
రిజల్యూషన్: 1840×2944
వోఎస్: ఆండ్రాయిడ్ 13 కలర్స్: స్టోర్మ్ గ్రే, ఓట్
ఇంటర్నల్: 128జీబి 4జీబి ర్యామ్ / 128జీబి 8జీబి ర్యామ్ / 256 జీబి 8జీబి ర్యామ్
బరువు: 615 గ్రా. బ్యాటరీ: 10200 ఎంఏహెచ్

పోర్ట్రానిక్స్ స్క్రీన్ క్లీనర్



బ్రాండ్: పోర్ట్రానిక్స్ కలర్: బ్లూ
మెటీరియల్: ప్లష్ బరువు: 50 గ్రా.
కంపాటబుల్ డివైజెస్: మానిటర్, ట్యాబ్లెట్ స్క్రీన్, స్మార్ట్ ఫోన్స్

గూగుల్ పాస్‌కీస్

ఆండ్రాయిడ్ డివైజ్‌ల కోసం సెర్చ్ ఇంజన్ దిగ్గజం గూగుల్ సరికొత్త క్రెడెన్షియల్ మేనేజర్‌ను తీసుకు రానుంది. 'పాస్ కీస్' ద్వారా ఈ టూల్ మన లాగిన్ అవసరాలకు ఉపయోగపడుతుంది. ఆన్‌లైన్ ఎకౌంట్స్‌లో లాగిన్ కావడానికి ఇదో కొత్త విధానం. దీని ద్వారా యూజర్‌లు పాస్‌వర్డ్ ఉపయోగించకుండానే వెబ్‌సైట్‌లు, అప్లికేషన్‌లలో లాగిన్ కావచ్చు. రైట్ అథంటికేషన్ మెథడ్ ద్వారా క్రెడెన్షియల్ మేనేజర్ 'పాస్‌కీస్' మరో లెవల్‌కు తీసుకువెళ్లనుంది.



ఇన్‌స్టాలో ఇంటర్నెట్ యాక్టివిటీ ట్రాకింగ్ స్టాప్ చేయడానికి...



- ఇన్‌స్టాగ్రామ్‌లో ప్రొఫైల్ పిక్చర్ టాప్ చేయాలి
- టాప్ రైట్ కార్నర్‌లో ఉన్న మూడు హారిజంటల్ లైన్స్‌ను టాప్ చేయాలి
- సెట్టింగ్ అండ్ ప్రైవసీ-సెలెక్ట్
- ట్యాప్-యాక్టివిటీ
- ట్యాప్-యాక్టివిటీ ఆఫ్ మెటా టెక్నాలజీస్
- ట్యాప్-డిస్‌కనెక్ట్ ఫ్యూచర్ యాక్టివిటీ

అడ్వాన్స్‌డ్ డాటా ఎనాలసిస్



చాట్‌బాట్ కోసం 'అడ్వాన్స్‌డ్ డాటా ఎనాలసిస్' అనే కొత్త ఫీచర్ గురించి ప్రకటించింది ఓపెన్ ఏఐ. దీని ద్వారా యూజర్‌లు పీడీఎఫ్ ఫైల్స్, డాటా ఫైల్స్, ఇతర ఫైల్స్ అప్‌లోడ్, ఎనాలసిస్ చేసుకోవచ్చు. ప్రస్తుతం ఇది బీటా దశలో ఉంది. సుదీర్ఘమైన డాక్యుమెంట్‌ల నుంచి సంక్షిప్త సమాచారం, రకరకాల డాటా పాయింట్స్‌ను అర్థం చేసుకోవడానికి, డాటా ఆధారంగా గ్రాఫ్స్ అండ్ చార్ట్స్ జనరేట్ చేయడానికి ఈ ఫీచర్ ఉపయోగపడుతుంది.

● సక్సెస్ స్టోరీ


ప్రమోద్ గాడ్గే

'భవిష్యత్ అనేది రకరకాల వస్తువులతో కూడిన బాక్స్‌లాంటిది. మనం తీసినప్పుడు ఏ వస్తువు చేతికందుతుందో తెలియదు. కొన్నిసార్లు నిరాశపరిచే వస్తువు, కొన్నిసార్లు అత్యంత విలువైన వస్తువు చేతికి అందవచ్చు'... ఈ సినిమా డైలాగ్‌ను ప్రమోద్ గాడ్గే, షాహిద్ మెమన్‌లు విన్నారో లేదో తెలియదుగానీ 'అన్‌బాక్స్' రూపంలో వారికి బాక్స్ నుంచి విలువైన కానుక లభించింది. తమ భవిష్యత్‌నే మార్చేసిన స్టార్టప్ కానుక అది.
లాజిస్టిక్ ఆటోమేషన్ స్టార్టప్ 'అన్‌బాక్స్ రోబోటిక్స్'తో అద్భుతమైన విజయాన్ని సొంతం చేసుకున్నారు ప్రమోద్, షాహిద్‌లు...


షాహిద్ మెమన్

అన్‌బాక్స్

అదరగొట్టారు

'మన దేశంలో ఇ-కామర్స్ వేగం పెరిగింది' అనే వార్త చదివి 'ఓహో అలాగా!' అనుకోవచ్చు. అద్భుతమైన 'ఐడియా' కూడా రావచ్చు. ఆ ఐడియా జీవితాన్నే మార్చేయవచ్చు. ప్రమోద్ గాడ్గే, షాహిద్ మెమన్‌ల విషయంలో జరిగింది ఇదే. మన దేశంలో ఇ-కామర్స్ స్పీడ్‌ను గమనించిన వీరు సప్లై చైన్ రోబోటిక్స్ స్టార్టప్ 'అన్‌బాక్స్ రోబోటిక్స్'తో విజయపథంలో దూసుకుపోతున్నారు. ఇండియా దాటి యూఎస్, యూరప్ మార్కెట్‌లోకి కూడా అడుగు పెట్టనున్నారు.

పుణే కేంద్రంగా మొదలైన 'అన్‌బాక్స్ రోబోటిక్స్' సప్లై చైన్ ఆటోమేషన్ సోల్యూషన్స్‌లో మార్పు తీసుకువచ్చింది. వినూత్న ఏఐ-ఆధారిత కంట్రోల్ సిస్టమ్ ద్వారా రోబోట్‌ల ఉత్పాదకతను పెంచింది. పనితీరును మార్చింది.

'మానవ శక్తి నుంచి రోబోట్స్ వరకు ప్యాకేజీలను క్రమబద్ధీకరించడం, రవాణా చేయడం... మొదలైన విధానాలు మన దేశంలో ఇ-కామర్స్ వేగాన్ని అందుకోలేక పోతున్నాయేమో అనిపించింది. దీన్ని దృష్టిలో పెట్టుకొని మొబైల్ రోబోటిక్స్ సిస్టమ్‌ను నిర్మించాలనుకున్నాం. లాజిస్టిక్స్, రిటైల్ ప్లేయర్‌ల కోసం ప్యాకేజీ సార్టింగ్, ఆర్డర్ కన్సాలిడేషన్ ప్రక్రియలను ఆటోమేట్ చేయడానికి శక్తిమంతమైన రోబోటిక్స్ వ్యవస్థను నిర్మించాలనుకున్నాం' గతాన్ని గుర్తు తెచ్చుకుంటాడు 'అన్‌బాక్స్ రోబోటిక్స్' సీయివో ప్రమోద్ గాడ్గే.

'అన్‌బాక్స్ రోబోటిక్స్'కు ముందు ఫ్లిప్‌కార్ట్‌లో సార్టింగ్‌కు సంబంధించి ఆటోమేషన్ విభాగంలో, మన దేశంలోని తొలి రోబోట్-బేస్డ్ సార్టింగ్ ప్రాజెక్ట్‌లో పనిచేశాడు ప్రమోద్.

'అన్‌బాక్స్ రోబోటిక్స్' కో-ఫౌండర్, సీటీవో షాహిద్ రోబోటిక్స్, ఇంటెలిజెన్స్ సిస్టమ్స్, స్వార్మ్ ఇంటెలిజెన్స్‌లో మంచి అనుభవం ఉంది. రోబోటిక్స్, ఆటోమేషన్ ఫీల్డ్స్‌లో సీటీవోగా పనిచేశాడు.

'అన్‌బాక్స్'కు ముందు 'వనోర రోబోట్స్' అనే స్టార్టప్ ప్రారంభించాడు.

చిత్తశుద్ధి, కష్టపడే తత్వం, అంకితభావం లేకపోతే పేపర్ మీద రాసుకున్న కాన్సెప్ట్ అక్కడే నిలిచిపోతుంది. అయితే ఈ ఇద్దరు మిత్రులు వారి బృందం బాగా కష్టపడి 'అన్‌బాక్స్'ను సూపర్ హిట్ చేశారు.

స్టార్టప్ కాన్సెప్ట్‌లో సత్తా ఉంటే ఇన్వెస్టర్‌లు వెనకడుగు వేయరు. 'అన్‌బాక్స్' విషయంలోనూ అదే జరిగింది. టీమ్‌ను విస్తరించడానికి, అంతర్జాతీయ స్థాయిలో కస్టమర్‌ల డిమాండ్‌ను నెరవేర్చడానికి, రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్‌పై సమీకరించిన నిధులను వాడారు.

> స్టార్టప్ కాన్సెప్ట్‌లో సత్తా ఉంటే ఇన్వెస్టర్‌లు వెనకడుగు వేయరు. 'అన్‌బాక్స్' విషయంలోనూ అదే జరిగింది.



2021లో థర్డ్-పార్టీ లాజిస్టిక్స్, ఇ-కామర్స్ ప్లేయర్స్‌తో కంపెనీ బీటా పైలట్స్ లాంచ్ చేసినప్పుడే లీడింగ్ ఇ-కామర్స్ లాజిస్టిక్స్ కంపెనీల నుంచి ఆర్డర్లు రావడం మొదలైంది. ఇది భవిష్యత్ విజయానికి సూచికలా పనిచేసింది. ఇన్వెస్టర్‌లలో మరింత నమ్మకాన్ని నింపింది.

'అన్‌బాక్స్' స్టార్టప్ ఇ-కామర్స్, లాజిస్టిక్స్, రిటైల్‌లాంటి సెక్టార్‌లలో ఏడు పెద్ద సంస్థలతో కలిసి పనిచేస్తోంది. క్లయింట్ సబ్‌స్క్రిప్షన్ మోడల్ 'రోబోట్ యాజ్ ఏ సర్వీస్'ను కూడా కంపెనీ ప్రారంభించింది.

ఇ-కామర్స్, లాజిస్టిక్స్, రిటైల్ రంగాలకు సంబంధించి రోబోటిక్-బేస్డ్ ఫుల్‌ఫిల్‌మెంట్, డిస్ట్రిబ్యూషన్ టెక్నాలజీలో ప్రత్యేకత సాధించిన 'అన్‌బాక్స్ రోబోటిక్స్' అంతర్జాతీయ స్థాయిలోనూ సత్తా చాటుతుంది.

యువర్స్

● ఇంగ్లిష్ ఇడియమ్స్



ఏ హెడ్‌స్టార్ట్

ఏదైనా విషయంలో, పోటీలో, పరీక్షలో....ఒక వ్యక్తికి అడ్వాంటేజ్ ఉంటే వాడే మాట... ఏ హెడ్‌స్టార్ట్.

ఉదా: మెర్లిన్స్ బ్యూటీ అండ్ నేచురల్ గ్రేస్ గేవ్ హర్ ఏ బిగ్ హెడ్‌స్టార్ట్ ఇన్ ది మోడలింగ్ అండ్ యాక్టింగ్

పాసింగ్ ది బక్

ఒక పనిలో తన రెస్పాన్సిబిలిటీని తప్పించుకోవడంలో భాగంగా నెపాన్ని ఇతరుల మీద నెట్టి బ్లేమ్ చేసే సందర్భంలో వాడే మాట...పాసింగ్ ది బక్.
ఉదా: డోన్ట్ ట్రై టు పాస్ ది బక్- దిస్ ఈజ్ యువర్ రెస్పాన్సిబిలిటీ, నాట్ మైన్.

● మ్యూజిక్ వరల్డ్

సంగీతమే శ్వాసగా...

కోల్‌కతాకు చెందిన సింగర్, సాంగ్ రైటర్ అమిక శైల్. తొమ్మిది సంవత్సరాల వయసులో 'లిటిల్ చాంప్స్' రియాలిటీ షోలో పాల్గొంది. ఫోక్, జాజ్, క్లాసిక్‌లో 'వావ్' అనిపించుకుంది. డిగ్రీ పూర్తయిన తరువాత తన కలను సాకారం చేసుకోవడానికి ముంబైకి వచ్చింది. 'స్ట్రగుల్' అంటే ఏమిటో అప్పుడే తెలిసింది. సినిమాల్లో పాడడానికి చేసే ప్రయత్నాలు విఫలం అవుతున్నాయి. హిందుస్థానీ క్లాసిక్ మ్యూజిక్‌లో అమికకు మంచి పట్టు ఉంది. అవకాశాలు వచ్చే వరకు ఖాళీగా కూర్చోవడం ఎందుకని మ్యూజిక్ టీచర్‌గా జాబ్‌లో చేరింది. ఎట్టకేలకు 'వెడ్డింగ్ యానివర్సరీ' సినిమాతో బ్రేక్ వచ్చింది. ఎన్నో టీవీ సీరియల్స్‌కు టైటిల్ సాంగ్స్ పాడింది. ఎన్నో రియాల్టీ షోలలో పాల్గొంది.

'సంగీతం అనేది నాకు అభిరుచి కాదు శ్వాసలాంటిది. సంగీత సాధనకు ఎన్ని గంటలైనా సరిపోవు. యాంత్రికంగా, మొక్కుబడిగా కాకుండా ప్రశాంత చిత్తంతో సంగీత సాధన చేయాలి' అంటున్న అమిక నటిగా కూడా రాణిస్తోంది. 'పవర్‌ఫుల్ డైలాగులో చెప్పడంలో, సరియైన భావోద్వేగాలు ప్రదర్శించడంలో నాలోని సింగర్ గురువులా మార్గదర్శనం చేస్తోంది' అంటుంది అమిక శైల్.


అమిక శైల్


అమిక శైల్

● గేమింగ్



అగ్గిబరాట

అడ్వెంచర్ వీడియో గేమ్ 'థ్రస్టీ సూటర్స్' విడుదల అయింది. యంగ్ లేడీ జాల తన సోదరి వివాహం సందర్భంగా స్వస్థలానికి వస్తుంది. ఆ తరువాత ఏమైంది అనేది ఈ గేమ్. సంస్కృతి, భావోద్వేగాలు, కుటుంబ ఒత్తిళ్లు, బంధాలకు ఈ గేమ్ కేంద్రబిందువు. సినిమాటిక్, టర్న్-బేస్డ్ బ్యాటిల్ సీక్వెన్స్‌లు ఉంటాయి.

గేమ్ ప్లే: కంబాట్, స్కేట్ బోర్డింగ్, కుకింగ్
జానర్స్: రోల్-ప్లేయింగ్ గేమ్, అడ్వెంచర్ గేమ్, యాక్షన్ గేమ్, అడ్వెంచర్
ప్లాట్‌ఫామ్స్: ప్లే స్టేషన్ 5, నిన్‌టెండో స్విచ్, ఎక్స్ బాక్స్ వన్, ప్లే స్టేషన్ 4, మైక్రోసాఫ్ట్ విండోస్, ఎక్స్ బాక్స్ సిరీస్ ఎక్స్, సిరీస్ ఎస్

సినిమా


● రామ్‌చరణ్

ఆస్కార్ యాక్టర్స్ బ్రాంచ్‌లో...

రామ్ చరణ్‌కి అంతర్జాతీయ స్థాయిలో అరుదైన గౌరవం దక్కింది. 'ది అకాడమీ ఆఫ్ మోషన్ పిక్చర్స్ ఆర్ట్స్ అండ్ సైన్సెస్' (ఆస్కార్ కమిటీ) తాజాగా వెల్లడించిన 'మెంబర్ క్లాస్ ఆఫ్ యాక్టర్స్' జాబితాలో రామ్‌చరణ్‌కి సభ్యత్వం దక్కింది. 'ఆర్ఆర్ఆర్'లో రామరాజు పాత్రలో అద్భుతంగా నటించినందుకుగాను చరణ్‌కి ఈ స్థానం లభించింది. కాగా 'ది అకాడమీ ఆఫ్ మోషన్ పిక్చర్స్ ఆర్ట్స్ అండ్ సైన్సెస్' ఆ మధ్య విడుదల చేసిన యాక్టర్స్ బ్రాంచ్‌లో తెలుగు నుంచి ఎన్టీఆర్‌కి చోటు దక్కిన విషయం తెలిసిందే. తాజాగా రామ్‌చరణ్‌తో పాటు మరికొందరు హాలీవుడ్ నటీనటులకు ఈ కమిటీలో చోటు దక్కింది. ''ఈ నటులు వెండితెరపై తమ ప్రతిభతో ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల హృదయాల్లో శాశ్వత స్థానాన్ని సంపాదించారు. వాస్తవానికి, కల్పితానికి మధ్య వారధులుగా నిలిచారు. ఎన్నో సినిమాల్లో వారి నటనతో పాత్రలకు ప్రాణం పోశారు. వారి కళతో సాధారణ సినిమాతో ప్రేక్షకులకు అసాధారణ అనుభవాలను అందిస్తున్నారు. అలాంటి వారిని 'యాక్టర్స్ బ్రాంచ్'లోకి ఆహ్వానిస్తున్నాం'' అని సోషల్ మీడియా వేదికగా ఆస్కార్ అకాడమీ ప్రతినిధులు షేర్ చేశారు. కాగా 96వ ఆస్కార్ అవార్డుల వేడుక వచ్చే ఏడాది మార్చిలో జరగనుంది.

చేయి పోయినా ఆత్మవిశ్వాసంతో సినిమా పూర్తి చేశాను

- సెబాస్టియన్ నోవా అకోస్టా

రక్షిత్ అట్లూరి హీరోగా నటించిన తాజా చిత్రం 'నరకాసుర'. సెబాస్టియన్ నోవా అకోస్టా జూనియర్ దర్శకత్వంలో డా.అజ్జా శ్రీనివాస్ నిర్మించిన ఈ చిత్రం నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా గురువారం విలేకర్ల సమావేశంలో సెబాస్టియన్ నోవా మాట్లాడుతూ- ''దర్శకుడు కావాలనేది నా కల. ఓ ఫిల్మ్ స్కూల్‌లో శిక్షణ తీసుకుని అవకాశాల కోసం ప్రయత్నించినా కుదర్లేదు. టెక్నాలజీపై అవగాహన కోసం 2012లో ప్రసాద్ ల్యాబ్‌లో చేరాను. అక్కడ రిలీజ్‌కు నోచుకోని సినిమాలు కనిపించాయి. దీంతో సినిమా తీయడం కాదు.. తీసిన సినిమాను మార్కెట్ చేసుకోవడం ముఖ్యమని భావించి సాయి కొర్రపాటిగారి సహాయంతో డిస్ట్రిబ్యూషన్ రంగంలో చేరాను. ఆ తర్వాత నా దర్శకత్వంలో సినిమా కోసం కథ రెడీ చేసుకున్నాను. చిన్నతనంలో నేను తప్పిపోతే ట్రాన్స్‌జెండర్స్ నన్ను మా కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ కథకు ఈ సంఘటన ఓ స్ఫూర్తి. ఇక దర్శకుడిగా తొలి అవకాశమే కష్టం అనుకుంటే.. 'నరకాసుర' చిత్రీకరణ టైమ్‌లో ఒరిస్సాలో షూటింగ్ పూర్తి చేసుకుని జబల్‌పూర్ వెళ్తుంటే ప్రమాదం జరిగి, నా చేయి పోయింది. ప్రమాదం జరిగిన తర్వాత 27వ రోజు నేను సెట్స్‌లోకి వచ్చి, ఆత్మవిశ్వాసంతో సినిమాను పూర్తి చేశాను. ఇక మాధవన్, అరుణ్ విజయ్, వివేక్ ఒబెరాయ్, టొవినో థామస్ వంటి స్టార్స్‌తో ట్రైబల్ నేపథ్యంలో ఓ సినిమా ప్లానింగ్‌లో ఉంది. మూడు భాషల్లో చిత్రీకరిస్తాం'' అన్నారు.



మా వ్యూహం మాకుంది

- రామ్‌గోపాల్ వర్మ


● కిరణ్‌కుమార్, రామ్‌గోపాల్ వర్మ

''అరచేతిని అడ్డుపెట్టి సూర్య కాంతిని ఆపలేరు. అలాగే మా 'వ్యూహం' సినిమా విడుదలను కూడా ఆపలేరు. ఈలోగా మా సినిమాపై ఎల్లో మీడియా తప్పుడు ప్రచారం చేయకుండా నేనే ముందుకొచ్చి మాట్లాడుతున్నా. ఒకవేళ మా చిత్రం రిలీజ్‌కి అడ్డంకులు సృష్టిస్తే ఏం చేయాలో మా వ్యూహం మాకుంది'' అని డైరెక్టర్ రామ్‌గోపాల్ వర్మ అన్నారు. అజ్మల్, మానస ప్రధాన పాత్రల్లో రామ్‌గోపాల్ వర్మ దర్శకత్వం వహించిన చిత్రం 'వ్యూహం'. దాసరి కిరణ్ కుమార్ నిర్మించిన ఈ సినిమా తొలి భాగం ఈ నెల 10న విడుదల కావాల్సి ఉంది. అయితే రిలీజ్‌ని వాయిదా వేస్తున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ మేరకు హైదరాబాద్‌లో జరిగిన ప్రెస్‌మీట్‌లో రామ్‌గోపాల్ వర్మ మాట్లాడుతూ-''వ్యూహం' చూసిన సెన్సార్ సభ్యులు రివైజింగ్ కమిటీకి పంపిస్తున్నట్లు సమాచారం ఇచ్చారు. ఎందుకు రివైజింగ్ కమిటీకి పంపిస్తున్నారో కారణాలు చెప్పలేదు. దీంతో ప్రస్తుతానికి సినిమా విడుదల వాయిదా వేస్తున్నాం. రివైజింగ్ కమిటీల్లోనూ తేల్చకుంటే 'ఉడ్తా పంజాబ్, పద్మావత్' వంటి హిందీ సినిమాలకు కోర్టు ద్వారా రిలీజ్ ఆర్డర్ తెచ్చుకున్నట్లే మేమూ తెచ్చుకుంటాం. చట్టపరంగా ఉన్న పద్ధతుల ద్వారా 'వ్యూహం'ను రిలీజ్ చేసుకుంటాం. ఈ సినిమా విడుదల ఆపాలని నారా లోకేశ్ సెన్సార్‌కు లేఖ రాసినట్లు తెలిసింది. అయితే అదెంత నిజమో చెప్పడానికి నా దగ్గర ఆధారాలు లేవు. మీడియా, సోషల్ మీడియాలో ప్రతి ఒక్కరూ తమ అభిప్రాయాలు చెప్పినట్లే 'వ్యూహం' ద్వారా నా అభిప్రాయాలు చెప్పాను. అది ఎవరైనా వింటారా? లేదా అన్నది అర్థం లేని ప్రశ్న. సినిమా ఇవ్వడం వరకే నా బాధ్యత'' అన్నారు. ''మా సినిమాను రివైజింగ్ కమిటీకి పంపినా నష్టం జరగదు. మేము అనుకున్నట్లే అన్నీ సకాలంలో జరుగుతాయని ఆశిస్తున్నాం. కొత్త రిలీజ్ డేట్‌ను త్వరలోనే ప్రకటిస్తాం''అన్నారు దాసరి కిరణ్ కుమార్.



హీరో వరుణ్ తేజ్, హీరోయిన్ లావణ్యా త్రిపాఠిల వివాహం ఇటలీలోని టస్కనీలో బుధవారం రాత్రి ఘనంగా జరిగింది. ఈ వివాహానికి మెగా, అల్లు కుటుంబ సభ్యులతో పాటు అత్యంత సన్నిహితులు, స్నేహితులు హాజరయ్యారు. హీరో అల్లు అర్జున్ సతీమణి స్నేహారెడ్డి, కుమారుడు అల్లు అయాన్, కుమార్తె అల్లు అర్హతో కలిసి వివాహానికి హాజరై వధూవరులకు అభినందనలు తెలిపారు.

లవ్ డ్యూయెట్

ఆనంద్ దేవరకొండ, రితికా నాయక్ జంటగా నటించనున్న సినిమాకు 'డ్యూయెట్' టైటిల్‌ను ఖరారు చేశారు. ఏఆర్ మురుగదాస్ దగ్గర అసిస్టెంట్‌గా చేసిన మిథున్ వరద రాజ కృష్ణన్‌ను దర్శకుడిగా పరిచయం చేస్తూ, స్టూడియో గ్రీన్ పతాకంపై కేజీ జ్ఞానవేల్ రాజా ఈ సినిమాను నిర్మించనున్నారు. ఈ సినిమా ప్రారంభోత్సవం గురువారం జరిగింది. ముహూర్తపు సన్నివేశానికి ఆనంద్ తల్లిదండ్రులు గోవర్ధన్ దేవరకొండ, మాధవి కెమెరా స్విచ్చాన్ చేయగా, హీరో హీరోయిన్లపై దర్శకుడు హరీష్ శంకర్ క్లాప్ ఇచ్చారు. తొలి సీన్‌కి దర్శకుడు చందు మొండేటి గౌరవ దర్శకత్వం వహించగా, దర్శక-నిర్మాత సాయిరాజేష్, నిర్మాత జ్ఞానవేల్ రాజా, ఈ చిత్ర సహ-నిర్మాత 'మధుర' శ్రీధర్ స్క్రిప్ట్‌ను దర్శకుడు మిథున్‌కు అందజేశారు. ఆనంద్ దేవరకొండ మాట్లాడుతూ- ''డ్యూయెట్' నాకు స్పెషల్ ఫిల్మ్. మిథున్ మంచి కథ రాశాడు'' అన్నారు. ''ఇదొక మంచి లవ్‌స్టోరీ'' అన్నారు మిథున్. ''ఈ కథ విన్నప్పుడు భావోద్వేగానికి లోనయ్యాను. జీవీ ప్రకాశ్‌కుమార్ ఆల్రెడీ రెండు పాటలు ఇచ్చేశారు. వారం రోజుల్లో తొలి షెడ్యూల్ ఆరంభిస్తాం'' అన్నారు. ఈ వేడుకకు హీరోలు విజయ్ దేవరకొండ, సత్యదేవ్ అతిథులుగా హాజరయ్యారు.


● రితిక, ఆనంద్ దేవరకొండ

ఈ సినిమా నాకో పెద్ద వేడుక

- 'సత్యం' రాజేశ్



'సత్యం' రాజేష్, కామాక్షీ భాస్కర్ల ప్రధాన తారాగణంగా, రాకేందు మౌళి, బాలాదిత్య, కరుణకుమార్ కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'మా ఊరి పొలిమేర 2'. 2021లో వీక్షకుల ముందుకు వచ్చిన 'మా ఊరి పొలిమేర'కు ఇది సీక్వెల్ చిత్రం. గౌరీకృష్ణ నిర్మించిన ఈ చిత్రాన్ని పంపిణీదారుడు వంశీ నందిపాటి నేడు విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా గురువారం జరిగిన విలేకర్ల సమావేశంలో 'సత్యం' రాజేశ్ మాట్లాడుతూ- ''మా ఊరి పొలిమేర'కు వీక్షకుల నుంచి వచ్చిన స్పందనను బట్టి 'మా ఊరి పొలిమేర 2' చేద్దామని అనుకున్నాం. తొలి భాగం ముగిసిన దగ్గర్నుంచే మలి భాగం ఆరంభమవుతుంది. కొమరయ్య (సినిమాలో 'సత్యం' రాజేశ్ పాత్ర) గురించి నిజాలు తెలుసుకున్న లక్ష్మి (కామాక్షీ పాత్ర) ఏం చేసింది? ఏ విధంగా పగ తీర్చుకోవాలనుకుంది? కవిత ఎలా జీవించి ఉంది? ఇలాంటి ఆసక్తికరమైన కథనంతో మంచి ట్విస్ట్‌లతో సాగుతుంది. నా కెరీర్‌లో ఓ పెద్ద వేడుకలా ఈ సినిమాను భావిస్తున్నాను. ప్రస్తుతం 'గీతాంజలి' సీక్వెల్, వరుణ్‌తేజ్ 'మట్కా' వంటి సినిమాల్లో కీలక పాత్రలు చేస్తున్నాను. హీరోగా 'టెనెంట్' చేస్తున్నాను'' అని చెప్పుకొచ్చారు.



''చేసిన పాత్రలనే మళ్లీ చేస్తే నాకు బోరింగ్‌గా అనిపిస్తుంటుంది. ఎప్పటికప్పుడు వినూత్నంగా, ప్రయోగాత్మకంగా సినిమాలు చేసే కార్తీనే ప్రేక్షకులు కూడా ఇష్టపడుతున్నారు. అంటే నేను నాలా ఉంటే ఆదరిస్తున్నారు. మరొకరిలా ఉండాలనుకోవడం లేదు. కాబట్టి నా తరహా సినిమాలే నేను చేస్తాను'' అని కార్తీ అన్నారు. కార్తీ హీరోగా 'జోకర్' ఫేమ్ రాజు మురుగన్ దర్శకత్వంలో ఎస్ఆర్ ప్రకాశ్‌బాబు, ఎస్ఆర్ ప్రభు నిర్మించిన 'జపాన్' చిత్రం ఈ నెల 10న విడుదల కానుంది. తెలుగు వెర్షన్‌ను అన్నపూర్ణ స్టూడియోస్ సంస్థ రిలీజ్ చేస్తోంది. ఈ సందర్భంగా గురువారం హైదరాబాద్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో కార్తీ చెప్పిన విశేషాలు.

అలాంటి కార్తీనే ఇష్టపడుతున్నారు!

- హీరో కార్తీ

● 'జపాన్' క్యారెక్టర్ బేస్డ్ ఫిల్మ్. నిజమైన కథ కాదు. కొన్ని వాస్తవ ఘటనల స్ఫూర్తితో ఈ సినిమాను రూపొందించాం. ఈ సినిమా కేవలం వినోదం ఇవ్వడం మాత్రమే కాదు... మన ఉనికిని, అస్తిత్వాన్ని ప్రశ్నించేలా కూడా ఉంటుంది. ప్రస్తుత సమాజాన్ని ప్రతిబింబించేలా ఉంటుంది. సోషల్ మీడియా అంశాన్ని కూడా టచ్ చేశాం. అలాగే మనకు 'జపాన్' అంటే హిరోషిమా, నాగసాకిలపై అణుబాంబు దాడి గుర్తుకు రావచ్చు. ఆ దాడి తర్వాత జపాన్ దేశం మళ్లీ పుంజుకుని అత్యున్నత స్థాయికి ఎదిగింది. ఈ రిఫరెన్స్ 'జపాన్' పాత్రలో కూడా కనిపిస్తుంది. ● చాలా కాలం తర్వాత మాస్‌తో కూడిన స్ట్రాంగ్ అండ్ సెటైరికల్ రోల్ నాకు మళ్లీ 'జపాన్'తో వచ్చినట్లు అనిపించింది. 'జపాన్' గ్రే క్యారెక్టర్ కాదు.. డార్క్ అంతే. నా క్యారెక్టర్‌లో డార్క్ హ్యూమర్ ఉంటుంది. 'జపాన్' కోసం రెగ్యులర్ కార్తీలా ఉండకూడదని అనుకున్నాను. దర్శకుడు కూడా ఇదే కోరుకున్నారు. ఈ సినిమా కోసం కొత్తగా మేకోవర్ అయ్యాను. నా వాయిస్ మాడ్యులేషన్, హెయిర్ స్టయిల్ అన్నీ కొత్తగా అనిపిస్తాయి. ● నేను నటించిన 'ఊపిరి' సినిమా తమిళ వెర్షన్‌కు దర్శకులు రాజు ముగరున్ డైలాగ్స్ రాశారు. ఆయనలో మంచి హ్యూమర్ ఉందని ఆ సమయంలో అనిపించింది. కానీ రాజుగారు తీసిన 'కుకు', 'జోకర్' సినిమాల్లో ఇది అంతగా లేదు. సాధారణంగా నేను నా కోసం ఏవైనా కథలు ఉన్నాయా? అని ఎవర్నీ అడగలేదు. తొలిసారి రాజు మురుగన్‌ని అడిగాను. ఓ డార్క్ ఎమోషనల్ స్టోరీ చెప్పారు. నాకు అంతగా నచ్చలేదు. ఆ తర్వాత మరో కథలోని ఓ క్యారెక్టర్ నచ్చి, ఆ పాత్ర ఆధారంగా కథ రాయమన్నాను. అలా 'జపాన్' కథ మొదలైంది. రాజు మురుగన్‌గారు గతంలో జర్నలిస్ట్‌గా చేశారు. ఆయన తన జీవితంలో చూసిన కొన్ని ఘటనలను 'జపాన్'లో చూపించే ప్రయత్నం చేశారు. అలాగే నాగార్జునగారి అన్నపూర్ణ స్టూడియోస్‌తో అసోషియేట్ అవ్వడం ఆనందంగా ఉంది. ● దర్శకుడు నలన్‌కుమార్‌తో నేను చేస్తున్న సినిమా 70 శాతం షూటింగ్ పూర్తయింది. '96' ఫేమ్ ప్రేమ్‌కుమార్‌తో ఓ సినిమా చేయనున్నాను. అలాగే 'ఖైదీ 2', 'సర్దార్ 2' చిత్రాలు చేయాల్సి ఉంది.

ఓ కల ఆధారంగా..

రోహిత్ నందా, ఆనంది జంటగా శ్రీకాంత్ రంగనాథన్, శ్రీనాథ్ రంగనాథన్ ద్వయం దర్శకత్వం వహించిన చిత్రం 'విధి'. ఎస్. రంజిత్ నిర్మించిన ఈ చిత్రం నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా గురువారం హైదరాబాద్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో రోహిత్ నందా మాట్లాడుతూ- ''న్యూజిల్యాండ్‌లో చదువుకున్నాను. నటనపై ఆసక్తితో స్టేజ్ డ్రామాల్లో చేశాను. చిరంజీవిగారి స్ఫూర్తితో ఇండస్ట్రీకి వచ్చాను. ఇక 'విధి' సినిమా రా అండ్ రస్టిక్ ఫిల్మ్. రియల్ లైఫ్‌లోని నా క్యారెక్టర్‌కు విభిన్నమైన పాత్రను ఈ సినిమాలో చేశాను. అలాగే మా 'విధి' సినిమాను చూపులేనివారు కూడా ఓ యాప్ సాయంతో ఆస్వాదించవచ్చు. ఈ ఆలోచన నాదే. కొన్ని కొత్త కథలు వింటున్నాను'' అన్నారు. ''మా కుటుంబ సభ్యుల్లో ఒకరికి వచ్చిన ఓ కల ఆధారంగా 'విధి' సినిమా స్టోరీ లైన్‌ను డెవలప్ చేసి, కథ రెడీ చేసుకున్నాం. రోహిత్ బాగా చేశారు'' అన్నారు శ్రీనాథ్, శ్రీకాంత్.


● రోహిత్ నందా

ఫ్యాషన్



ఉంగరాల గొలుసులు

వేళ్లకి ఉంగరాలు, మెడలో గొలుసులు ధరించడం సాధారణమే! చేతులకు ఉంగరాలు.. చెయిన్లు, హ్యాండ్ కఫ్స్ ధరించడం ఇప్పుడు ట్రెండ్. ఇండోవెస్టర్న్, వెస్టర్న్ డ్రెస్సుల మీదకు ఈ ఉంగరాలు, చెయిన్ల వరసలు స్పెషల్ అట్రాక్షన్‌గా నిలుస్తున్నాయి. యువత వేగానికి, స్టయిల్‌కి అద్దంలా భాసిల్లుతున్నాయి.

బంగారు వరసలు

లైట్ వెయిట్ జ్యువెలరీలో భాగంగా హ్యాండ్ కఫ్స్, చెయిన్స్ డిజైనర్లను ఆధునికత వైపుగా పరుగులు తీయిస్తున్నాయి. ఆభరణాల డిజైనర్లు బంగారు లోహంతో వెస్టర్న్ స్టైల్ డిజైన్స్‌ను కొత్తగా మెరిపిస్తున్నారు.

వెండి వెలుగులు

తక్కువ ఖర్చు అనే జాబితాను ఈ తరం పక్కన పెట్టేస్తోంది. ఏ డిజైన్ తమకు మరింత అందాన్ని తీసుకువస్తుందో, నలుగురిలో గుర్తింపును సంపాదిస్తుందో దానినే ఇష్టపడుతోంది. అందుకే సిల్వర్ డిజైన్స్ మరింతగా యువత మదిని గెలుచుకుంటున్నాయి.

స్టీల్ మెరుపులు

స్ట్రీట్ అండ్ బోహో స్టైల్‌లో స్టీల్‌తో తయారైన ఆభరణాలను యువత ఎక్కువ ధరిస్తుంటుంది. క్యాజువల్ వేర్, పార్టీవేర్‌కీ నప్పే ఈ డిజైన్ వరసలు వందల రూపాయల నుంచి మార్కెట్‌లో లభిస్తున్నాయి.

బ్యూటిప్స్

వేకువ జాముకు చలి తొంగి చూస్తోంది. కిటికీలో నుంచి దొంగలా గదిలో దూరుతోంది. చల్లగా ఒంటికి హాయినిస్తుంది. కానీ చర్మాన్ని పెళుసుబారుస్తుంది కూడా. అందుకే ఆలస్యంగా చర్మసంరక్షణ మొదలవ్వాలి.

శీతాకాలానికి స్వాగతం

- రాత్రి పడుకునే ముందు ముఖాన్ని శుభ్రంగా కడిగి ఆరిన తర్వాత బాదం నూనె లేదా ఆలివ్ ఆయిల్ రాయాలి.
- గోరువెచ్చటి నీటిని దోసిట్లోకి తీసుకుని ముఖాన్ని నీటిలో మునిగేటట్లు ఉంచాలి. ఇది హాట్‌థెరపీ. రోజుకొకసారి ఉదయం స్నానం చేయడానికి ముందు కానీ రాత్రి పడుకునే ముందుకానీ చేయవచ్చు.
- ఒక కోడిగుడ్డు సొనలో, టీ స్పూన్ కమలారసం, టీ స్పూన్ ఆలివ్ ఆయిల్, నాలుగైదు చుక్కల పన్నీరు, అంతే మోతాదులో నిమ్మరసం కలిపి ముఖానికి పట్టించి పదిహేను నిమిషాల తర్వాత కడిగేయాలి. ఇది పొడిచర్మానికి వేయాల్సిన ప్యాక్.
- బాగా మగ్గిన అరటిపండును మెత్తగా చిదిమి ముఖానికి, మెడకు పట్టించి పదిహేను నిమిషాల తర్వాత గోరువెచ్చటి నీటితో ముఖాన్ని కడగాలి. ఇది పొడిచర్మానికి మాయిశ్చరైజర్‌గా పని చేస్తుంది, మెడ నలుపు కూడా వదులుతుంది.



- పొడిచర్మాన్ని మృదువుగా మార్చడంలో గ్రేప్‌సీడ్ ఆయిల్ బాగా పని చేస్తుంది. ఆయిల్‌ను ఒంటికి రాసి మర్దన చేయాలి.
- ఫేస్‌ప్యాక్‌లకు బదులుగా స్వచ్ఛమైన ఆముదం ఒంటికి రాసి మర్దన చేసుకోవాలి. ఆముదం వల్ల చర్మం మృదువుగా మారడంతో పాటు అనేక చర్మ సమస్యలు కూడా తగ్గుతాయి.

పారా హుషార్

ఇలాంటి వాళ్లకి ఎలా బుద్ధి చెప్పాలి?

బెంగళూరులోని ప్రముఖ మాల్. ఒక పెద్దమనిషి చాలా సేపుగా దేనికో కాచుకుని ఉన్నాడు. ఒక మహిళను గమనించాడు. వెనుక నుంచి వచ్చి ఆమెను అసభ్యంగా తాకి జనంలో కలిసిపోయాడు. కాని ఇది ఎవరో రికార్డు చేసి సోషల్ మీడియాలో పెట్టారు. బెంగళూరు పోలీసులు అతన్ని పట్టుకోవడానికి రంగంలో దిగారు. రద్దీ ప్రదేశాల్లో స్త్రీలను అసభ్యంగా తాకడం కొందరికి అలవాటు. వీరితో ఎలా అప్రమత్తంగా ఉండాలి? వీరు మన ఇంటి మగవారే అయితే ఏ విధంగా సంస్కరించాలి?

మొన్నటి ఆదివారం జరిగింది ఇది: బెంగళూరులోని ఒక భారీ మాల్‌లో తన కుటుంబంతో షాపింగ్ చేస్తున్న జయప్రకాష్ (30)కి అతని చెల్లెలు దూరంగా ఉన్న ఒక వ్యక్తిని చూపింది. అన్నయ్యా... అతను ఆడవాళ్లను తాకుతున్నాడు అని చెప్పింది. జయప్రకాష్ పెద్దగా పట్టించుకోలేదు కాని కాసేపు ఆ వ్యక్తినే గమనిస్తే అతడు ఉద్దేశపూర్వకంగా ఆడవాళ్లను తాకుతున్నాడని అర్థమైంది. మాల్ రద్దీగా ఉండటంతో అతడు తాకుతున్నా ఆడవాళ్లు ఏదో యాదృచ్ఛికంగా తగిలాడు అన్నట్టుగా ముందుకు కదిలిపోతున్నారు. జయప్రకాష్ వెంటనే తన కెమెరాతో ఆ వ్యక్తి చర్యను రికార్డు చేశాడు. మాల్ వారికి కంప్లయింట్ చేశాడు. అంతేకాదు, సోషల్ మీడియాలో పెట్టాడు. అంతే! ఆ వీడియో దావానలంలా వ్యాపించింది. మాల్ వాళ్లిచ్చిన కంప్లయింట్ ఆధారంగా ఐపిసి సెక్షన్ 354 కింద కేసు నమోదు చేసిన పోలీసులు అతణ్ణి సీసీ కెమెరాల ద్వారా గుర్తించి ఆశ్చర్యపోయారు. ఎందుకంటే ఆ వ్యక్తి బెంగళూరుకు చెందిన ఒక రిటైర్డ్ హెడ్‌మాస్టర్. 8 నెలల క్రితమే రిటైర్ అయ్యాడు. వీడియో వైరల్ కావడంతో పోలీసులు రావడం కంటే ముందే అతను కుటుంబంతో సహా ఇంటికి తాళం వేసి ఎటో వెళ్లిపోయాడు. అయినా పోలీసులు వెతుకుతున్నారు.

ఒక 'చిన్న దుశ్చర్య'- దారుణ ఫలితం: ఆడవాళ్లను పబ్లిక్ ప్లేసుల్లో అసభ్యంగా కొన్ని సెకన్లపాటు తాకడం పెద్ద తప్పేం కాదని మగవారనుకుంటారు. ఇది 'అత్యాచారం' కాదు కదా. బలవంతం చేయడం కాదు కదా... వారికి తెలిసే లోపల తాకి వెళ్లిపోతాం కదా అనుకుంటారు. కాని ఆ సెకన్ల చర్య కూడా స్త్రీలకు తెలుస్తుంది. వికారం కలిగిస్తుంది. ఇప్పుడు ఈ రిటైర్డ్ హెడ్‌మాస్టర్ చేసిన చర్య బయట పడటంతో అతని పరువు, మర్యాదలు గంగలో కలిశాయి. కన్నడ టీవీ చానెళ్లు అతడి ఫొటో పెట్టి బజారుకు ఈడ్చాయి. పోలీసు కేసు నిరూపితమైతే శిక్ష కూడా పడుతుంది. బహుశా అతనికి ఎదిగొచ్చిన పిల్లలు, కొడుకు, కోడలు, కూతురు... వీరంతా ఉంటే వారి కుటుంబాలు కూడా మాటలు పడాలి. ఇవన్నీ



మగవారు ఎందుకు ఆలోచించరు?

మ్యాన్ టచింగ్: ఇలా ఆడవాళ్లను పబ్లిక్ ప్లేసుల్లో తాకడాన్ని 'మ్యాన్‌టచింగ్' అని కొందరు అంటారు. ఒక స్త్రీ శరీరం అందుబాటులోకి వస్తే దానిని తాకొచ్చనే గుంపులో గోవింద స్వభావం మగవాణ్ణి ఇందుకు ఉసిగొల్పుతుంది. లైంగిక అభద్రతలు కొందరిని ఇలా చేయడానికి ప్రేరేపిస్తే, లైంగిక ఉద్రేకం కోసం కొందరు ఇలా చేస్తారు. గమనించాల్సిందేమంటే ఈ మగవారంతా మిగతా సమయాల్లో 'పరువు, మర్యాద, మంచి ఉద్యోగం' ఉన్న వ్యక్తులే. అపరిచితులు, పరిచితులు కూడా ఇలా చేస్తారు. ఎవరూ గమనించకుండా శరీర భాగాలు తాకేవారు కొందరైతే, వేదికల మీద పెళ్లిళ్లు, శుభకార్యాలలో పెద్దరికం వహిస్తూ బుగ్గలు పుణకడం, భుజాల చుట్టూ చేతులు వేసి దగ్గరకు తీసుకోవడం మరికొందరు చేస్తారు. ఇవన్నీ స్త్రీల అనుమతి లేకుండా వారిని తాకడంగానే భావించాలి.

మగవాళ్లు దొంగసాకులు: 1. కొంచెమలా రాసుకుంటే ఏమవుతుంది అనుకోవడం... ఆమె మరీ రెచ్చగొట్టేలా ఉంది అనడం. 2. ఆమె నన్ను రెచ్చగొట్టి తాకేలా చేసింది అనడం 3. పరిచయం ఉన్న ఆమేగా... ఏమనుకుంటుందిలే అనుకోవడం 4. ఆమె పట్ల నా ఇష్టాన్ని తెలిపేందుకు అనడం... ఇలా ఏం చెప్పినా ఒక స్త్రీని ఆమె అనుమతి లేకుండా ఎక్కడా తాకకూడదు.

నిలువరించాలి: స్త్రీలు బహిరంగ ప్రదేశాలలో 'ఎందుకులే రచ్చ' అనుకోకుండా ఇలా అసభ్యంగా తాకే వారిని వెంటనే నిలువరించాలి. చూపు ద్వారా, మాట ద్వారా వీరిని ఒక్క క్షణంలో నిలువరించవచ్చు. సాయం తీసుకుని పోలీసులకు పట్టివ్వొచ్చు. పరిచితులు అస్తమానం తాకుతూ ఉన్నా వారికి మొహమాటం లేకుండా తాకొద్దని చెప్పేయాలి. ముఖ్యంగా పిల్లలకు పబ్లిక్ ప్లేసుల్లో ఎవరినీ తాకనీకుండా చూసుకోవాలని హెచ్చరించాలి.

మన ఇంటి మగవారు: పై కేసులోని రిటైర్డ్ హెడ్‌మాస్టర్‌కు కూడా ఒక ఇల్లు ఉంటుంది. ఇలా ఆడవాళ్లను తాకాలని చూసే మగవారు ఏ ఇంటిలో అయినా ఉండొచ్చు. ఇంటి ఆడవాళ్లు మాటల్లో మాటగా ఎవరైనా పబ్లిక్ ప్లేసుల్లో తమను తాకితే ఎంత కంపరంగా ఉంటుందో చెబుతుండాలి. అలా చేసిన వారిని పబ్లిక్‌గా పట్టుకొని దండిస్తే ఎంత అవమానంగా ఉంటుందో చెప్పాలి. స్త్రీలను గౌరవించి వారికి అసౌకర్యం కలిగించే ఏ పనీ చేయరాదని తప్పక చెప్పాలి. అలాగే సామాజిక ఆరోగ్యం కోసం మగవారు తమ చపలత్వాన్ని నివారించుకోవడం తప్పక అభ్యాసం చేయాలి- దొరికి దెబ్బలు తినడం కంటే అదే మేలు.

పురస్కారం

షేక్‌స్పియరే తన పవర్

'ఏ యుద్ధం ఎందుకు జరిగెనో? ఏ రాజ్యం ఎన్నాళ్లుందో?
తారీఖులు, దస్తావేజులు... ఇవి కావోయ్ చరిత్రకర్థం'... మహాకవి మాట తిరుగులేని సత్యం అయినప్పటికీ కొన్నిసార్లు యుద్ధాలు, తారీఖులు, ప్రేమ పురాణాలు, ముట్టడికైన ఖర్చులు... చారిత్రక పరిశోధనకు అవసరం. ఏ సమాచారమూ వృథా పోదు.

వర్తమానంలో ఉండి ఆనాటి మొగల్, బ్రిటిష్ ఇండియాలోకి వెళ్లడం అంత తేలిక కాదు.

అలుపెరగని పరిశోధన కావాలి. అంతకుముందు కనిపించని ప్రత్యేక వెలుగు ఏదో ఆ పరిశోధనలో ప్రతిఫలించాలి.

అందమైన శైలికి అద్భుతమైన పరిశోధన తోడైతే...అదే 'కోర్టింగ్ ఇండియా' పుస్తకం.

ప్రొఫెసర్ నందిని దాస్ రాసిన 'కోర్టింగ్ ఇండియా: ఇంగ్లాండ్, మొఘల్ ఇండియా అండ్ ది ఆరిజిన్స్ ఆఫ్ ఎంపైర్' పుస్తకం ప్రతిష్ఠాత్మకమైన బ్రిటిష్ అకాడమీ బుక్ ప్రైజ్-2023 గెలుచుకుంది...



● నందినీ దాస్

ఇంట్లో, తరగతి గదిలో, పుస్తకాల్లో, టీవీల్లో విన్న కథల ద్వారా నందిని దాస్‌కు షేక్‌స్పియర్ ఇష్టమైన రచయితగా మారాడు. ఆ మహా రచయితపై ఇష్టం ఆంగ్ల సాహిత్యంపై ఇష్టంగా మారింది. ఆయన పుస్తకాలు తన మనోఫలకంపై ముద్రించుకుపోయాయి.

అలనాటి ప్రయాణ సాహిత్యం నుంచి భిన్న సంస్కృతుల మధ్య వైరుధ్యాల వరకు నందినికి ఎన్నో అంశాలు ఆసక్తికరంగా మారాయి. పరిశోధిస్తూ, రాసే క్రమంలో తన మానసిక ప్రపంచం విశాలం అవుతూ వచ్చింది.

యూనివర్శిటీ ఆఫ్ ఆక్స్‌ఫర్డ్‌లో నందిని దాస్ ప్రొఫెసర్. షేక్‌స్పియర్ సాహిత్యం ఆమెకు కొట్టిన పిండి. ఆమె పేరు పక్కన కనిపించే విశేషణం...'స్పెషలిస్ట్ ఇన్ షేక్‌స్పియర్ స్టడీస్'

కోల్‌కతాలోని జాదవ్‌పూర్ యూనివర్శిటీలో బీఏ ఇంగ్లీష్ చేసింది నందిని. ఆ తరువాత స్కాలర్‌షిప్‌పై యూనివర్శిటీ కాలేజి, ఆక్స్‌ఫర్డ్‌లో చేరింది. కేంబ్రిడ్జ్, ట్రినిటీ కాలేజిలో ఎంఫిల్, పీహెచ్‌డీ చేసింది. ఒక ప్రచురణ సంస్థలో సాఫ్ట్‌వేర్ ప్రోగ్రామర్‌గా పని చేసిన నందిని సంవత్సరం తరువాత మళ్లీ అకాడమిక్ రిసెర్చ్‌లోకి వచ్చింది.

ఇక తాజా విషయానికి వస్తే...

'ది పవర్ ఆఫ్ గుడ్ రైటింగ్'గా విశ్లేషకులు కీర్తించిన 'కోర్టింగ్ ఇండియా' యూరోపియన్‌ల హింసా ధోరణి గురించి చెప్పింది. రాయబార కార్యాలయాల అసమర్థతను ఎత్తి చూపింది. మొఘల్ రాజకీయాలను ఆవిష్కరించింది.

'ఆనాటి బ్రిటన్, ఇండియాలకు సంబంధించి వాస్తవిక చిత్రాన్ని ఆవిష్కరించింది నందిని. మొగల్ రాజుల ఒడిదొడుకుల నుంచి బ్రిటీష్ వైఖరి వరకు ఈ పుస్తకంలో ఎన్నో కనిపిస్తాయి' అంటాడు బ్రిటీష్ అకాడమీ బుక్‌ప్రైజ్- ఛైర్ ఆఫ్ ది జ్యూరీ ప్రొఫెసర్ చార్లెస్ ట్రిప్.

చలి కొరుకుడుని తట్టుకోవాలంటే నోటికి కాస్త వేడివేడి రుచులు తగలాల్సిందే. వేడితోపాటు కారం, కరకర లాడే కమ్మదనం తోడయితే చలిని కూడా కొరికేయవచ్చని చెబుతోంది ఈ వారం వంటిల్లు.

చలిని వెచ్చగా కొరికేద్దాం!

వంటిల్లు



పొటాటో పాన్‌కేక్స్

కావలసినవి: ఉడికించి చిదుముకున్న బంగాళ దుంపలు – రెండు కప్పులు; గుడ్డు – ఒకటి; మైదా – ముప్పావు కప్పు; స్ప్రింగ్ ఆనియన్ తరుగు – రెండు టేబుల్ స్పూన్లు; చీజ్ తరుగు – కప్పు; క్యారట్ తురుము – అర కప్పు; ఉప్పు – రుచికి సరిపడా; మిరియాల పొడి – రెండు టీస్పూన్లు; నూనె – అరకప్పు; పుల్లటి పెరుగు – గార్నిష్‌కు సరిపడా.

తయారీ: ● గిన్నెలో చిదిమిన దుంపల మిశ్రమం, గుడ్డుసొన, మైదా, స్ప్రింగ్ ఆనియన్, చీజ్ తరుగు, మిరియాలపొడి, రుచికి సరిపడా ఉప్పువేసి కలపాలి ● ఈ మిశ్రమం చేతులకు అంటుకుంటున్నట్లు అయితే మరో టేబుల్ స్పూను మైదా వేసి కలపాలి ● పిండి ముద్దను ఇరవై నిమిషాలు పక్కన పెట్టుకోవాలి ● ఇరవై నిమిషాల తరువాత పిండిని చిన్నచిన్న ముద్దలుగా చేసి పాన్‌కేక్‌లా వత్తుకోవాలి ● బాణలిలో నూనె వేయాలి. బాగా కాగిన నూనెలో ఒక్కో పాన్‌కేక్‌ను వేసి మీడియం మంట మీద కాల్చాలి ● క్రిస్పీగా బ్రౌన్ కలర్‌లోకి మారాక పాన్‌కేక్‌లను తీసేయాలి ● పాన్‌కేక్ పైన కొద్దిగా పుల్లటి పెరుగువేసి సర్వ్ చేసుకోవాలి.



పోహా వెజ్ కట్‌లెట్

కావలసినవి: అటుకులు – కప్పు; ఉడికించిన బంగాళ దుంపలు – రెండు; క్యాప్సికం తరుగు – రెండు టీస్పూన్లు; క్యారట్ తురుము – రెండు టీస్పూన్లు; పచ్చిబఠాణీ – రెండు టేబుల్ స్పూన్లు; కొత్తిమీర తరుగు – రెండు టేబుల్ స్పూన్లు; ధనియాల పొడి – టీస్పూను; చాట్ మసాలా – టీస్పూను; కారం – టీస్పూను; పచ్చిమిర్చి పేస్టు – టీస్పూను; కార్న్‌ఫ్లోర్ – రెండు టేబుల్ స్పూన్లు; బ్రెడ్ ముక్కల పొడి – కప్పు; ఉప్పు – రుచికి సరిపడా; నూనె – డీప్‌ఫ్రైకి సరిపడా.

తయారీ: ● అటుకులను శుభ్రంగా కడిగి పదినిమిషాలు నానబెట్టుకోవాలి ● పదినిమిషాల తరువాత నానిన అటుకుల్లో తొక్కతీసిన దుంపలు, బఠాణీ, క్యాప్సికం, క్యారట్, కొత్తిమీర తరుగు వేయాలి ● పచ్చిమిర్చి పేస్టు, చాట్ మసాలా, ధనియాల పొడి, రుచికి సరిపడా ఉప్పు వేసి ముద్దలా కలపాలి ● పిండిని ఉండలుగా చేసి, కట్‌లెట్‌లా వత్తుకుని పక్కన పెట్టుకోవాలి ● కార్న్‌ఫ్లోర్‌లో నీళ్లు పోసి పేస్టులా కలపాలి ● ఒక్కో కట్‌లెట్‌ను కార్న్‌ఫ్లోర్ పేస్టులో ముంచి, తరువాత బ్రెడ్ ముక్కల పొడిని అద్దాలి ● బ్రెడ్ ముక్కల పొడి అద్దిన తరువాత డీప్ ఫ్రై చేసుకోవాలి ● గోల్డెన్ కలర్‌లోకి మారాక తీసి సాస్ లేదా గ్రీన్ చట్నీతో సర్వ్ చేయాలి.



పనీర్ కుర్‌కురే

కావలసినవి: నిలువుగా కోసిన పనీర్ ముక్కలు – రెండు కప్పులు; పసుపు – టీస్పూను; కారం – టీస్పూను; ఉప్పు – రుచికి సరిపడా; కసూరీ మేథీ – టేబుల్ స్పూన్; వాము – అరటీస్పూను; చాట్ మసాలా – టీస్పూను; గరం మసాలా – టీస్పూను; కొత్తిమీర తరుగు – రెండు టేబుల్ స్పూన్లు; అల్లం వెల్లుల్లి పేస్టు – టేబుల్ స్పూను; కార్న్‌ఫ్లేక్స్ – రెండు కప్పులు; శనగపిండి – రెండు కప్పులు; నూనె – డీప్‌ఫ్రైకి సరిపడా.

తయారీ: ● పనీర్ ముక్కలపైన చిటికెడు సాల్ట్, కారం, టేబుల్ స్పూను కొత్తిమీర తరుగు, చాట్ మసాలా వేసి కలిపి పక్కన పెట్టుకోవాలి ● పెద్ద గిన్నె తీసుకుని శనగపిండి, వాము, అల్లం వెల్లుల్లి పేస్టు, కసూరీ మేథీ, గరం మసాలా, రుచికి సరిపడా ఉప్పు వేసి కలపాలి ● ఇప్పుడు నీళ్లు పోసి బజ్జీపిండిలా కలుపుకొని పక్కన పెట్టుకోవాలి ● ఒక ప్లేటులో కార్న్ ఫ్లేక్స్‌ను నలిపి పెట్టుకోవాలి ● ఇప్పుడు ఒక్కో పనీర్ ముక్కను తీసుకుని ముందుగా శనగపిండి మిశ్రమంలో ముంచాలి. తరువాత కార్న్‌ఫ్లేక్స్‌ను అద్ది సలసలా కాగుతోన్న నూనెలో వేసి డీప్‌ఫ్రై చేయాలి ● పనీర్ ముక్క క్రిస్పీగా మారితే పన్నీర్ కుర్‌కురే రెడీ.



పాలక్ మేథీ పూరీ

కావలసినవి: జీలకర్ర – టేబుల్ స్పూను; సోంపు – టేబుల్ స్పూను; వాము – టీస్పూను; నువ్వులు – టేబుల్ స్పూను; ధనియాల పొడి – టేబుల్ స్పూను; పచ్చిమిర్చి – మూడు; అల్లం తరుగు – టీస్పూను; కరివేపాకు – రెండు రెమ్మలు; పాలకూర తరుగు – రెండు కప్పులు; మెంతికూర తరుగు – కప్పు; గోధుమ పిండి – రెండు కప్పులు; శనగపిండి – పావు కప్పు; పసుపు – అరటేబుల్ స్పూను; ఉప్పు – రుచికి సరిపడా; కారం – టేబుల్ స్పూను; నూనె –డీప్‌ఫ్రైకి సరిపడా.

తయారీ: ● జీలకర్ర, సోంపు, నువ్వులు, వాము, ధనియాల పొడి, పచ్చిమిర్చి; అల్లం తరుగు, కరివేపాకుని మిక్సీజార్‌లో వేసి మెత్తగా గ్రైండ్ చేయాలి ● పాలకూర, మెంతికూర తరుగుని గిన్నెలో వేయాలి. దీనిలోనే గోధుమపిండి, శనగపిండి, కారం, పసుపు, గ్రైండ్ చేసిన మసాలా పొడి, రుచికి సరిపడా ఉప్పు, టేబుల్ స్పూను నూనె వేసి కలపాలి ● ఈ మిశ్రమంలో కొద్ది కొద్దిగా వేడినీళ్లు చల్లుకుంటూ ముద్దలా కలపాలి ● పిండిని చిన్న చిన్న ఉండలుగా చేసి పూరీలా మందంగా వత్తుకోవాలి ● గుండ్రని గిన్నె లేదా చిన్న గ్లాసుతో పూరీని చిన్న చిన్న చెక్కల్లా కట్ చేయాలి ● అన్నీ రెడీ అయ్యాక క్రిస్పీగా మారేంత వరకు డీప్ ఫ్రై చేస్తే రుచికరమైన పాలక్ మేథీ పూరీ రెడీ.